
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# 'చంద్ర'బంధం

- ఓటు - నోటు కేసు అటకెక్కినట్లే
- రాజీలో కేంద్రం జోక్యం
- హైదరాబాద్‌ను వదిలేసిన చంద్రబాబు
- కేసును వదిలేసిన కేసీఆర్

నీది ముందు చూపు కాదు దొంగచూపు... దొంగకోళ్ల పట్టే వాడివిలాగుంటావు... నీకు సిగ్గులజ్జ లేదు... నువ్వొక మనిషివేనా, నీదీ ఒక బ్రతుకేనా... కొన్ని నెలల క్రితం ఏ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలివి. తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టాక కేసీఆర్ సోనియాగాంధీని మొదలుకొని చాలామంది నాయకులను తిట్టాడు. అయితే చంద్రబాబును తిట్టినంత తీవ్రస్థాయిలో ఇంకెవరినీ తిట్టి ఉండడంటే అతిశయోక్తి కాదు. చంద్రబాబు పేరెత్తితేనే ఆయన నోటివెంట తిట్లు దానావలంలా వచ్చేవి. కేసీఆర్ చేత ఇన్ని తిట్లు తిన్నాక ఎవరైనాసరే ఇక అతని వద్దకు పోడు. కేసీఆర్‌ను జన్మలో కలవాలనుకోడు. కాని చంద్రబాబు అలాకాదు. రాజకీయంగా తలపండిన వాడు కాబట్టి ఇలాంటి తిట్లను ఆయన పెద్దగా పట్టించుకోడు. కాబట్టే ఆయన ఇప్పుడు కేసీఆర్‌తో సర్దుకుపోగలుగుతున్నాడు. (మిగతా 11వ పేజీలో)





# స్వర్ణోత్సవ సక్సెస్

**భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) తన అంతరిక్ష పయనంలో ఎన్నో మైలురాళ్లు దాటింది. ఆ ప్రయాణంలో ఎన్నో విజయాలు నమోదు చేసింది. ఆ ప్రయాణంలోనే ఈ నెల 16వ తేదీన కీలక మలుపు చోటు చేసుకుంది. సింగపూర్ స్వాతంత్ర్య స్వర్ణోత్సవ కానుకగా మన ఇస్రో స్వర్ణోత్సవ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. 16వ తేదీ సాయంత్రం 6గంటలకు ఈ అద్భుతం ఆవిష్కృతమైంది.**

సింగపూర్‌కు స్వాతంత్ర్యం వచ్చి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ దేశ అంతరిక్ష పరిశోధనా సంస్థ తయారు చేసిన ఆరు ఉపగ్రహాలను 'ఇస్రో' తన 50వ ప్రయోగం ద్వారా నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టి సింగపూర్ స్వర్ణోత్సవ స్వాతంత్ర్యానికి స్వర్ణోత్సవ ప్రయోగ సంబరాన్ని జత చేసింది. సింగపూర్ మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ 'ఇస్రో' శాస్త్రవేత్తలు ఆ దేశానికి చెందిన ఆరు ఉపగ్రహాలను పిఎస్ఎల్‌వి-సి29 రాకెట్ ద్వారా విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టారు. బుధవారం సాయంత్రం 6గంటలకు శ్రీహరికోట, షార్‌సెంటర్ లోని ల్యాంచ్‌ప్యాడ్ నుండి

(మిగతా 11వ పేజీలో)



# స్వరానికి స్వర్ణోత్సవం

*తెలుగు సినీసంగీత చరిత్రలో తొలి శకం ఘంటసాల గారిదైతే, నేటి శకం బాలూ గారిదే. సరిగ్గా యాభై ఏళ్ళ క్రితం ఇదే డిసెంబర్ (15.12.1966)లో బాలూ (శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం) పాడిన తొలిపాట మద్రాసులోని విజయగార్డెన్స్‌లో రికార్డయింది. శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న అనే చిత్రంలో 'ఏమి ఈ వింత మోహం'.. అనే పాటతో బాలూ తెలుగు చిత్ర రంగం ప్రవేశించారు. నాటి నుంచి నేటిదాకా ఆయన అలుపెరుగని పాటల యాత్ర చేస్తూనే వున్నారు. తన గంధర్వగానంతో ఆబాలగోపాలాన్నీ అలరిస్తూ గానగంధర్వునిగా అందరి ప్రశంసలూ అందుకుంటూనే వున్నారు. ఆయన తొలిపాట గానంచేసి ఈ డిసెంబర్ 15తో 50 ఏళ్ళయింది. ఆయనకే కాదు.. ఆయన పాటల పూదోటలో విహరించి పరవశించే తెలుగువారందరికీ ఇదొక ముఖ్యమైన జ్ఞాపకమే. అదొక మధురమైన ఘట్టమే!... ఈ సందర్భంగా ఆ 'స్వర్ణోత్సవ స్వరానికి' మనసారా అభినందనలు.*

(మిగతా 11వ పేజీలో)



# సత్వర న్యాయం.. లోక్ అదాలత్ లక్ష్యం



రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించి చట్టబద్ధమైన సత్వర న్యాయం కక్షిదారులకు అందించాలనే లక్ష్యంతో ప్రతినెలా రెండవ శని వారం దేశవ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గారావు పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో 12వ తేదీ జరిగిన జాతీయ లోక్‌అదాలత్ ప్రారంభ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇక్కడ పరిష్కారమైన కేసులకు చట్టబద్ధత ఉంటుందని, అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. జిల్లా ఎస్పీ గజారావు భూపాల్ మాట్లాడుతూ పిటి కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల మిగతా కేసుల్లో పోలీసుశాఖకు దర్యాప్తు పూర్తి చేసే అవకాశం ఉంటుందని అన్నారు. వీటి పరిష్కారానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని, తద్వారా పెండింగ్ కేసులు పరిష్కార మార్గం సుగమం అవుతుందన్నారు. నెల్లూరుజిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 11బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ బెంచ్‌లకు జిల్లా అదనపు న్యాయమూర్తులు బి.పాపిరెడ్డి, రామచంద్రమూర్తి, ఎం.కిష్టప్ప, సీనియర్ సివిల్ జడ్జిలు పి.వి.సుబ్బారావు, భూపాల్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు, మేజిస్ట్రేట్‌లు హేమలత, టి.కేశవ, వాసుదేవన్, ఎం.శోభారాణి, అరుణశ్రీ, ఎ.పద్మలు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి మొత్తం 3255కేసులను పరిష్కరించారు. వీటిలో అత్యధికంగా 2311 ఎలక్ట్రిసిటి కేసులు పరిష్కారం కాగా, రూ.33,77,500లు రికవరీ జరిగింది. 166 మోటారు ప్రమాదకేసులు పరిష్కారం కాగా లబ్ధిదారులకు రూ.3,27,85,000లు పరిహారంగా లభించింది. బ్యాంకు కేసుల్లో రూ.33,03,000లు రికవరీ లభించింది. జాతీయ లోక్‌అదాలత్‌ను సంస్థ కార్యదర్శి సి.సత్యవాణి పర్యవేక్షించారు.

# ఇద్దరు ఎస్సైల సస్పెండ్

అవినీతి అలసత్వంపై ఫిర్యాదులు రావడంతో ఇద్దరు ఎస్సైలను సస్పెండ్ చేస్తూ 12వ తేదీ రాత్రి ఐజీ కార్యాలయం నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట ఎస్సైగా పనిచేస్తున్న సిహెచ్ కోటిరెడ్డి విధుల్లో అలసత్వం వహించడంతో సస్పెండ్ చేశారు. ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్సైపై సిండికేట్ దాడి వ్యవహారంలో కేసు నమోదు చేయకుండా మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ అధికారులకు మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణల నేపధ్యంలో నెల్లూరు బాలాజీనగర్ ఎస్సై ఎ.నాగేశ్వరరావుపై సస్పెండ్ వేటు పడింది. ఇటీవల శ్రీనివాస అగ్రహారం వద్ద పేకాట ఆడుతున్న బృందాన్ని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2.5లక్షలు తీసుకుని వదిలేసినట్లు పోలీసు ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో అతనిని ఐజి సంజయ్ సస్పెండ్ చేశారు.

# పూలరైతులు సస్యరక్షణ పాటించాలి

పూలతోటలను సాగుచేసే రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని, అందువల్ల పూలసాగు ద్వారా మంచి లాభాలు పొందవచ్చని వెంకటగిరి సమీపంలో పెట్లూరులో వున్న నిమ్మ, చీనీ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపాల్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త బి.గోవిందరాజులు సూచించారు. సోమవారం ఆయన వెంకటగిరి రైల్వేస్టేషన్ వద్ద వున్న నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూలతోటల్లో రకరకాల పూలమొక్కలను పెంచడంతో పాటు, ఆ తోటల సాగులో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎరువులు, పురుగుమందులను ఇష్టంవచ్చిన రీతిలో వాడకూడదని, వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకు ఏ రకం పూలసాగుకు ఏవి అవసరమో వాటిని తగు మోతాదులోనే వేయాలని రైతులకు సూచించారు. నిమ్మ రైతులకు నాణ్యమైన మొక్కలను అందించాలనే ఉద్దేశంతో నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని నిర్వహిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ముసవ్వీర్‌కు మూడు వరల్డ్ రికార్డులు



నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్‌కి మూడు అరుదైన వరల్డ్ రికార్డులు సొంతమయ్యాయి. గతంలో స్వర్ణం, వెండితో అనేక సూక్ష్మ కళారూపాలను తయారుచేసి అందరి మన్ననలు అందుకునివున్నారు. 200మిల్లీ గ్రాములతో గణేష్ సూక్ష్మ నమూనాను తయారు చేసినందుకు మార్వలెస్ వరల్డ్ రికార్డు, 160మిల్లీ గ్రాములతో తాజ్‌మహల్ సూక్ష్మనమూనా రూపొందించినందుకు అసిస్ట్ వరల్డ్ రికార్డు, 19గ్రాముల బంగారంతో 50సూక్ష్మ నమూనాలను తయారు చేసినందుకు స్టైబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లభించాయి. ఈ మూడు రికార్డుల ధృవీకరణ పత్రాలను ఆయనకు ఆయా సంస్థల నుంచి కొరియర్ ద్వారా అందాయి. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలు, సామాజిక సమస్యలపై ఎన్నో సూక్ష్మ స్వర్ణశిల్పాలు రూపొందించిన ముసవ్వీర్ ఇప్పటికే పలు రికార్డులతో పాటు డాక్టరేట్ కూడా పొందారు. తాజాగా మూడు కొత్త రికార్డులు పొందడంతో సింహపురి ప్రజలు ముసవ్వీర్‌కు అభినందనలు తెలిపారు.

# అభివృద్ధి బాబు లక్ష్యం.. అవినీతి జగన్ మార్గం



- కళా వెంకట్రావ్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రతి ఆలోచన ప్రతి అడుగు అభివృద్ధి కోసమేనని, నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ఆయన పని చేస్తుంటే, ఒంటికంతా అవినీతి బురద అంటించుకున్న జగన్ అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతుండడం శోచనీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావ్ పేర్కొన్నారు. 14వ తేదీ నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన తర్వాత రాష్ట్రం అనేక సమస్యల్లో వుంది. ఆర్థిక ఇబ్బందులున్నాయి. ఈ సమస్యలను చంద్రబాబు ఎంతో సమర్థవంతంగా ఎదుర్కొంటూ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్‌పై చిత్తశుద్ధి ఉంటే ప్రతిపక్ష నాయకుడు కూడా ప్రభుత్వం చేసే పనులకు సహకరించాలి. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. మన దౌర్భాగ్యం కొద్ది అలాంటి బాధ్యత లేని ప్రతిపక్ష నేతగా జగన్ వున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం తప్ప ఆయనకు ఇంకేమీ తెలియదు. అమరావతి రాజధాని కోసం రైతులే స్వచ్ఛందంగా 35వేల ఎకరాల భూములిచ్చినా, బలవంతంగా భూములు లాక్కుంటున్నారంటూ జగన్ గొడవ చేస్తున్నాడు. రాష్ట్రంలో తల్లి కాంగ్రెస్ ఇప్పటికే ఉడ్చిపెట్టుకు పోయింది, పిల్ల కాంగ్రెస్(వైకాపా)కు కూడా త్వరలో అదే గతి పడుతుంది. ఆ పార్టీల్లో ఉన్నోళ్లు ఇప్పటికే తెలుగుదేశం వైపు చూస్తున్నారని కళా వెంకట్రావ్ చెప్పారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, పార్టీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అనూరాధ, కిలారి వెంకటస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ ఐయస్‌టిలో క్రీడోత్సవాలు



జెఎన్‌టియుఎ పరిధిలోని స్వయం ప్రతిపత్తి కలిగిన ఇంజనీరింగ్ కళాశాలకు జరగవలసిన స్వయం ప్రతిపత్తి అంతర్ కళాశాలల క్రీడా పోటీలకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐయస్‌టి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 19, 20, 21తేదీలలో జరగబోవు క్రీడా పోటీలకు దాదాపు 500మంది క్రీడాకారులు రానున్నారు. వారికి పురుషుల విభాగంలో, మహిళల విభాగంలో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి జెఎన్‌టియుఎ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి బి.జోజిరెడ్డి, ముగింపు వేడుకలకు గూడూరు డిఎస్‌పి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

## కొనసాగుతున్న 'నేస్తం' సాయం



నేస్తం ఫౌండేషన్ ద్వారా నెల్లూరు ఓవెల్ స్కూలు విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ ఉద్యోగులు అందజేసిన ఆహార, వస్త్ర సామాగ్రిని ఈ నెల 12న చెన్నై వరద బాధిత ప్రాంతాల్లో పంపిణీ కొరకు నేస్తం ఫౌండేషన్ ఆహార పంపిణీ వాహనం ద్వారా పంపడం జరిగింది. ఓవెల్ స్కూలు విద్యార్థులు 42బస్తాల దుస్తులను వితరణ చేయగా, ట్రైబల్ వెల్ఫేర్ ఉద్యోగులు వాటర్ బాటిల్స్, బియ్యం, కందిపప్పు, బ్రెడ్ ప్యాకెట్లు, బిస్కెట్లు వితరణ చేయడం జరిగింది. వీటిని సేకరించిన నేస్తం ఫౌండేషన్ సభ్యుల బృందం చెన్నై బయలుదేరి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్, ట్రైబల్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవిజికె ప్రసాద్, ఓవెల్ స్కూలు ప్రిన్సిపాల్ ఆర్.వేణు, ఏఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలు



సింహపురి సమాచారం

నెల్లూరు నగరంలోని వేదాయపాలెం జివిఆర్ఆర్ కళాశాలలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి యోగా ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిసాయి. అండర్ 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు జరిగిన పోటీల్లో ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో వ్యక్తిగత టీం ఈవెంట్లలో గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హరిహర ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు హరికుమార్‌రెడ్డి, స్కూల్‌గేమ్స్ నిర్వహణ కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరాజు, యోగా శిక్షకుడు నరశింహశాస్త్రి, ఆర్ఎస్ఎస్ రామదండు తదితరులు పాల్గొన్నారు.

**ఓవరాల్ ఛాంపియన్ నెల్లూరు**

యోగా పోటీల్లో నెల్లూరుజిల్లా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనపరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-19 రిథమిక్ విభాగంలో నెల్లూరుకు చెందిన ఎన్.దినేష్, ఆర్టిస్టిక్ యోగాలో నెల్లూరు క్రీడాకారుడు యం.వి.రమణ బంగారు పతకాలు సాధించారు. అండర్-17 విభాగంలో ఆర్టిస్టిక్, రిథమిక్‌లో నెల్లూరు క్రీడాకారులు జ్యోతిప్రియ, వై.జోష్ణవిలు బంగారు పతకాలు సాధించారు అండర్ -14 ఆర్టిస్టిక్, రిథమిక్‌లో గుంటూరు క్రీడాకారిణి బి.నాదాంజలి, నెల్లూరు క్రీడాకారుడు కౌశిక్‌లు బంగారు పతకాలు సాధించారు.

# మార్కెట్‌లోకి 'వాటర్‌బేస్' రొయ్యల దాణా




దేశంలో అత్యున్నత నాణ్యతకలిగిన ఆక్వాఫీడ్‌ను ఉత్పత్తి చేసే అగ్రశ్రేణి కంపెనీలలో ఒకటైన ది వాటర్‌బేస్ లిమిటెడ్ వారు ఆరోగ్యకరమైన రొయ్య పిల్లల ఉత్పత్తి కోసం అవసరమైన పోషకాలతో రూపొందించిన కొత్తతరం రొయ్యపిల్లల దాణా 'బే వైట్ ఎన్‌రిచ్డ్'ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఇది అత్యుత్తమంగా జీర్ణమయ్యే సముద్ర, కాయగూరల ప్రోటీన్ల మిశ్రమం. ఈ ఫీడ్‌లో రొయ్య పిల్లల ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు అన్నీ వుంటాయి.

'బే వైట్ ఎన్‌రిచ్డ్' విడుదల సందర్భంగా ది వాటర్‌బేస్ లిమిటెడ్ సిఇఒ రమాకాంత్ వి ఆకుల మాట్లాడుతూ భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులు గత ఏడాది రూ.33,414కోట్లు దాటాయని, ఎగుమతి ఆదాయంలో రొయ్య పిల్లల ఎగుమతులు 67శాతం ఉన్నాయని, ప్రపంచ మార్కెట్లో తన వాటాను పెంచుకోగలిగే మహత్తరమైన సామర్థ్యం భారతదేశానికి ఉందన్నారు. మంచి వ్యవసాయ అభ్యాసాలు, నాణ్యమైన విత్తనాలు, దాణాల లభ్యతతో ద్విగుణీకృతమైతే రొయ్య పిల్లల ఉత్పత్తి పెరుగుదల విషయంలో పరిశ్రమకు అది సాయపడుతుందన్నారు. పుష్కలమైన పోషకాలతో, యాంటి-బయాటిక్ రహితమైన రొయ్యపిల్లల దాణాను అభివృద్ధిపరచడం మీద మేము ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నామని, తాజాగా అందిస్తున్న 'బే వైట్ ఎన్‌రిచ్డ్' ఒక కొత్త తరం రొయ్యపిల్లల దాణా, సహజసిద్ధమైన క్రిమినిరోధక చర్య ద్వారా పేగుల ఆరోగ్యాన్ని పెంచే, హెపటోపాంక్రియాస్ పనితీరు మెరుగుపరచడం ద్వారా అందుబాటులో ఉండే శక్తిని పెంచే సహజమైన క్రియాశీలక దినుసులతో దీన్ని అభివృద్ధి చేశామని తెలిపారు.



# మాగుంట - బొమ్మిరెడ్డిల వివాహ వైభోగం







## తారక్‌నాథ్ - గీతిక



ఆత్మకూరు నుండి మూడుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికై ఒక గొప్ప ప్రజావైద్యుడిగా మంచి హస్తవాసి వున్న డాక్టర్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి మనుమడు, జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి సోదరుడైన డా॥ రవీంద్రనాథ్‌రెడ్డి - శ్వేతల కుమారుడు **తారక్‌నాథ్** వివాహం నెల్లూరు సరస్వతీనగర్‌కు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, నెల్లూరుజిల్లాలోనే కాక దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన కుటుంబంగా పేరున్న మాగుంట సుబ్బరామరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగానే కాక వారింటి పేరైన మాగుంటను తన ఇంటి పేరుగా కలిగివున్న మాగుంట వెంకటనారాయణరెడ్డి - రాజ్యలక్ష్మిల కుమార్తె **డా॥ గీతిక**తో ఈ నెల 16వ తేదీ ఉదయం నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు అత్యంత వైభవంగా జరిగింది. అదే రోజు సాయంత్రం అక్కడే రిసెప్షన్ వేడుకలు సైతం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ రెండు వేడుకలకు జిల్లా నుండే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, వివిధ రంగాల ముఖ్యులు పెద్దసంఖ్యలో విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.

# వడ్డీలంటే... నడ్డి విరగ్గొడతా!

### - జిల్లా ఎస్పీ గజరావు భూపాల్



అధికవడ్డీల పేరిట ప్రజలను పీడించి, బెదిరించి వారిపై దారుణాలకు పాల్పడే కాల్‌నాగుల తాటతీస్తామని నెల్లూరుజిల్లా ఎస్పీ డా॥ గజరావుభూపాల్ హెచ్చరించారు. బుధవారం తన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ అలాంటి వారిపై అవసరమైతే పిడియాక్ట్‌లను సైతం నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చే వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థల వివరాలను సేకరించినట్లు తెలిపారు. వారి కార్యాలయాలు, ఇళ్లను సోదాలు చేస్తూ, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. వారి వద్ద నుంచి వడ్డీకి రుణాలు తీసుకున్నవారికి స్వయంగా తమ సిబ్బంది ఫోన్లు చేసి ఎంత వడ్డీకి రుణం తీసుకున్నారు, ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా అనే వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఫోన్లలో నష్టపోయామంటున్నారే తప్ప ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికవడ్డీల పేరిట ప్రజలపై దౌర్జన్యం చేసినా, ఆస్తులు రాయించుకున్నా, మహిళలను లోబరచుకోవాలని యత్నించినా వ్యాపారులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుశాఖతో పాటు ఆదాయపన్ను అధికారులతో దాడులు చేస్తామని ప్రకటించారు. వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారులపై సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

# ఆదుకునేది చంద్రబాబే



ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో పేద ప్రజలను అన్ని విధాలుగా ఆదుకున్నది చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వమేనని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పేర్కొన్నాడు. 17వ తేదీ ఆయన నెల్లూరు రూరల్ 12వ డివిజన్‌లోని వావిలేటిపాడు గ్రామంలో ఇటీవల వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి బాధితులకు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ వరదలను చూసి స్పందించిన చంద్రబాబు, పేదప్రజలకు వెంటనే పరిహారం అందించడంలో ప్రత్యేక చొరవచూపారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో భాగం కావాలని నాన్న, చిన్నానలతో పాటు తమ కుటుంబం తెలుగుదేశంపార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు. వావిలేటిపాడు గ్రామాభివృద్ధికి స్థానిక తెలుగుదేశం నాయకులతో కలసి పనిచేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మోపూరు రాధాకృష్ణారెడ్డి, మధురెడ్డి, రఘురామయ్య, గౌస్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కాంగ్రెస్‌కు కొత్త నాయకత్వం

- డీసీసీ అధ్యక్షుడిగా పనబాక
- పీసీసీ ఉపాధ్యక్షుడిగా చేవూరు
- సమన్వయ కమిటీలో శేషన్న







విభజన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ చచ్చుబడిపోయింది. కీలకమైన నాయకులంతా తలోదారి చూసుకున్నారు. నెల్లూరుజిల్లాలో అయితే దాదాపు పెద్ద తలకాయలన్నీ పార్టీని వదిలిపోయాయి. పార్టీలో నమ్మకంగా మిగిలివున్నోళ్లతోనే కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను పనబాక కృష్ణయ్యకు అప్పగించారు. డీసీసీ అధ్యక్షుడిగా వున్న కొడవలూరు ధనుంజయరెడ్డి ఆనం సోదరులతో పాటు తెలుగుదేశంలో చేరిపోవడంతో జిల్లా పార్టీకి కొత్త నాయకుడిని పెట్టాల్సి వచ్చింది. మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి భర్తయిన కృష్ణయ్య ఈ జిల్లావాసులకు సుపరిచితుడే! రైల్వేశాఖలో ఉన్నతాధికారిగా వుంటూ 2009ఎన్నికలప్పుడు ఆయన రైల్వేశాఖ నుండి విఆర్‌ఎస్ తీసుకుని రాజకీయాల్లోకి వచ్చారు. గూడూరు కాంగ్రెస్ అభ్యర్థిగా ఆ ఎన్నికల్లో పోటీచేసి నేదురుమల్లి వెన్నుపోటు మూలంగా ఓటమిపాలయ్యారు. అయినా కాంగ్రెస్‌ను కనిపెట్టుకుని వున్నారు. ఢిల్లీ స్థాయిలో పనబాక లక్ష్మి చక్రం తిప్పి తన భర్తకు డీసీసీ అధ్యక్షపదవిని ఇప్పించుకోగలిగారు.

ఇక నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి శిష్యుడిగా కాంగ్రెస్‌లో వున్న సీనియర్ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిని, పీసీసీ ఉపాధ్యక్షులుగా నియమించడం జరిగింది. చేవూరు దేవకుమార్‌రెడ్డికి పార్టీ పరంగా ఎప్పుడూ న్యాయం జరగలేదు. కోవూరు నియోజకవర్గంలో ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఆయనే నాయకుడు. నల్లపరెడ్ల ఆధిపత్యాన్ని తట్టుకుని అక్కడ పార్టీని నిలబెట్టింది కూడా చేవూరే! 1989 నుండి ఆయన కోవూరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను కాపాడుకుంటూ వస్తున్నా 1994లో తప్పితే ఇక ప్రతిసారీ ఆయనకు సీటు విషయంలో మొండిచేయి చూపారు. కాంగ్రెస్‌కు ఆయన చాకిరీ చేసాడు గాని, కాంగ్రెస్ వల్ల ఆయన లబ్ధిపొందిందేమీ లేదు. పార్టీ వల్ల ప్రయోజనం పొందినవాళ్లంతా ఈరోజు కష్టకాలంలో కాంగ్రెస్‌ను వదిలిపోతే, చేవూరు లాంటి వాళ్లు మాత్రమే పార్టీకి అండగా నిలిచారు. ఇప్పటికైనా పీసీసీ ఉపాధ్యక్షుడిగా ఆయనను నియమించడం నిఖార్సయిన పార్టీ అభిమానులను గౌరవించడమే! అలాగే పార్టీ రాష్ట్ర సమన్వయకమిటి సభ్యుడిగా మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డిని, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పి.చెంచలబాబుయాదవ్‌ను, నెల్లూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉడతా వెంకట్రావ్‌యాదవ్‌ను నియమించి జిల్లా కాంగ్రెస్‌కు కొత్త నాయకత్వాన్ని అందించారు.

# రబీలో రైతులకు ఋణాలు



ఈ రబీ సీజన్‌లో పంటలకు సిద్ధమౌతున్న రైతులకు ఋణాలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు డీసీసీబీలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఋణాలు అందించి రబీ సీజన్‌కు సహకరించాలన్నారు. ఈ యేడాది బ్యాంకు నూతనంగా ప్రవేశపెట్టిన రైతు వికాస్ పథకానికి మంచి స్పందన లభిస్తుందని ఆయన చెప్పారు. ఈ యేడాది వంద కోట్ల ఋణాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 52కోట్లు మంజూరు చేయడం జరిగిందని, బ్యాంకు వ్యాపార లావాదేవీలు 523కోట్లకు పెరిగాయన్నారు.

# 'చందన'లో పండుగ సంబరాలు





క్రిస్మస్, నూతన సంవత్సరం ప్రారంభం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని నెల్లూరులోని చందన, సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో ఆదివారం బైక్ వీక్లీ డ్రా నిర్వహించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ ఈ బైక్ వీక్లీ డ్రా తీశారు. ఈ డ్రాలో వెంకటేశ్వరపురం జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన షేక్ చాంద్‌బాషా(కూపన్ నెం.04663)ను అదృష్టం వరించి హీరో బైక్‌ను గెలుచుకున్నారు. అలాగే ఈ నెల 16వ తేదీన సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్ యాదవ్ చేతుల మీదుగా వీక్లీ డ్రాను నిర్వహించారు. విజేత ఎస్.కె.చాన్ బాషాకు హీరో డీలక్స్ బైక్‌ను ఎమ్మెల్యే అనిల్ అందజేశారు. ఈ సందర్భంగా సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, 40 రోజుల పాటు 352 బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా 20వ తేదీ సాయంత్రం 6గంటలకు చందన బ్రదర్స్, సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఫ్యాన్సీ డ్రస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం, డైలీ డ్రా విజేతలకు బహుమతులు అంద జేశారు.

ఈ కార్యక్రమాలలో రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రభా'తం

పారిస్‌లో ఇటీవల ఒక అద్భుతం ఆవిష్కృతమైంది. అదొక చరిత్రాత్మక ఘట్టానికి నాంది పలికింది. భూమండలం మీద వున్నవారందరికీ నిజంగా ఇదొక శుభవార్తే. వాతావరణపరంగా భూమికి ముంచుకొస్తున్న పెను విపత్తును అడ్డుకునేందుకు ప్రపంచ దేశాలన్నీ పారిస్‌లో జరిగిన సదస్సులో ఒక్క తాటిపై నిలవడమే ఆ అద్భుతం. అంతేకాదు, భూ తాపోన్నతిని రెండు డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ స్థాయికి పరిమితం చేద్దామంటూ ఒక్కసారిగా 195 దేశాలు ప్రతిజ్ఞ చేయడం ఒక అపూర్వ ఘట్టం. నవంబరు 30 నుంచి డిసెంబర్ 12వ తేది వరకు పారిస్‌లో జరిగిన ఎంతో కీలకమైన ఈ వాతావరణ శిఖరాగ్ర సద స్సులో 195 దేశాల అధిపతులు, ప్రభుత్వాధినేతలు హాజరుకావడం, భూ వాతావరణానికి సంబంధించి అనేక రకాల అంశాలు ప్రస్తావనకు రావడం, పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగాయి.

ప్రపంచదేశాలను ఇప్పుడు వణికిస్తున్న ప్రధానమైన సమస్యల్లో ఒకటి ఉగ్రవాదం కాగా, రెండవది వాతావరణంలో మార్పులనే విషయం అందరికీ తెలిసిందే. ఎల్‌నినో ప్రభావం వల్ల అకాల వర్షాలు, అతివృష్టి - అనావృష్టి పరిస్థితులు, అదేవిధంగా భారీవర్షాలు, వరదలు, ఉప్పెనలు వంటి ప్రకృతి వైపరీత్యాలు ఈ వాతావరణ మార్పుల వల్ల తరచూ సంభవిస్తుంటాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. భూ తాపోన్నతి వల్ల చెన్నై, ఉత్తరాఖండ్‌లలో వచ్చినట్లుగా అకాల వర్షాలు, వరదలు ఉపద్రవాలుగా విరుచుకుపడతాయి. వేసవి ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగి పోతుండడం వల్ల అనేక ప్రమాదాలూ వున్నాయి. సముద్ర మట్టాలు తగ్గిపోవడం, పంటలు పండక కరువులు వాటిల్లడం వంటి విపత్తులూ వెన్నంటి వున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో హిమాలయాలు సైతం కరిగిపోతున్నాయి. ఈ పరిస్థితి ఏ ఒక్కదేశానికో పరిమితం కాదు, భూమిపై ఎక్కడైనా ఎప్పుడైనా ఈ విపత్తులు సంభవించవచ్చునని వేరే చెప్పనక్కర లేదు. ఈ ఉత్పాతాల వల్ల జరిగే నష్టాలు కూడా అపారం కనుక, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు కలసి ఈ విపత్తులను ఎదుర్కొనేందుకు సమాయత్తం కావడం ఒక్కటే మార్గం. అన్నిటికంటే ముందు వాతావరణ మార్పులకు కారణభూతమవుతున్న కర్బన్ వాయువుల విడుదలను ఎంతగా తగ్గిస్తే వాతావరణానికి, పర్యావరణ పరిరక్షణకు అంత మంచిది. లాభాపేక్ష తప్ప ధరిత్రి క్షేమం పట్టని అగ్రరాజ్యాలు, సంపన్న దేశాలు భారీగా కర్బన ఉద్గారాలను విడుదల చేస్తుండడం అందరికీ తెలిసిందే. ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఈ కర్బన కాలుష్యంలో అధికశాతం అంటే దాదాపు 70 శాతం సంపన్న దేశాలదేనని గణాంకాలు చెప్తున్నాయి. అందులో అమెరికా వాటా 27 శాతం దాకా వుంటే, చైనా 11, రష్యా 8 శాతం దాకా.. ఇలా పలు దేశాలు ఈ కోవలో వున్నాయి. మన దేశం వాటా 3 శాతం మించి లేదు. 1992లో తొలిసారిగా ధరిత్రి సదస్సు జరిగిన తర్వాత కూడా భూమండలం ఉష్ణోగ్రత క్రమేణా 3 డిగ్రీల దాకా పెరిగిందని, అదేవిధంగా 74 కోట్ల ఎకరాల్లో అడవులు అంతరించాయని కూడా ఐక్యరాజ్య సమితి నివేదికలు పేర్కొంటున్నాయి. తీసుకున్న నిర్ణయాలను సత్వరం అమలుచేయకుంటే ఇలాంటి పరిస్థితులే ఏర్పడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యల వల్ల పేద దేశాల్లో ఏటా 74 లక్షల మంది దాకా మరణిస్తున్నారనే ఆందోళనకరమైన వాస్తవాన్ని కూడా ఎవరూ విస్మరించడానికి లేదు. ధరిత్రిని కాపాడుకోవడం అందరి బాధ్యత అనే విషయంలో ఎవరికీ ఎలాంటి మినహాయింపూ లేదు. రానురాను మానవాళి మనుగడకు ముప్పుగా పరిణమిస్తున్న పర్యావరణ సమస్యను ప్రపంచమంతా ఒక సవాల్‌గా స్వీకరించి, శాశ్వత పరిష్కారాన్ని కనుగొని, చిత్తశుద్ధితో ఆచరించడమొక్కటే మార్గం. ఈ నేపథ్యంలో, పారిస్ సదస్సు మేలైన నిర్ణయాలే తీసుకోవడం సంతోషకరం.

భూ తాపాన్ని ఎదుర్కొనేందుకు 2020 నుంచి సంపన్న దేశాలు వర్ధమాన దేశాలకు ఏటా నూరు బిలియన్ డాలర్ల వంతున సాయం అందించాల్సి వుంటుందని కూడా ఈ సదస్సు ఆమోదించిన ప్రకటనలో పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్ ఈ విషయాన్ని సదస్సు ప్రారంభంలో సూచించడం అందుకే. ఇది అందరి మంచికే. ఇలా పారిస్ సదస్సు పలు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. కర్బన ఉద్గారాల్లో తమ దేశం రెండవ స్థానంలో వుందని పారిస్ సదస్సుకు ముందే అమెరికా అధ్యక్షుడు ఒబామా అంగీకరించడం ఈ సందర్భంగా ఒక విశేషమైతే, దానిని పరిష్కరించుకుంటామని కూడా ఆయన హామీ ఇవ్వడం మరో విశేషమైన విశేషం. అమెరికా హామీ అందరికీ ఆనందం కలిగించేదే. గతంలో ఈ ఉద్గారాల తగ్గింపు విషయంలో చేసుకున్న క్యోటో ఒప్పందం, కోపెన్‌హగ్‌లో నిర్ణయాలు, డర్బన్ సదస్సు ఆలోచనలూ అన్నీ అటకెక్కి కూర్చుని వున్న నేపథ్యంలో, పారిస్ సదస్సు ఎంతో ఆశావహంగా కనిపిస్తోంది. దీర్ఘకాలంలో అన్ని దేశాలూ కర్బన ఉద్గారాల ఊసేలేని ఆర్థిక వ్యవస్థల ఏర్పాటుకు కృషి చేయాలని ఈ సదస్సు పిలుపునివ్వడం శుభపరిణామం. ఈ దృష్ట్యా సదస్సు నిర్ణయాలు ఎంతో చరిత్రాత్మకమైనవని ప్రధాని మోడీ కూడా అభినందించారు. ఈ సందర్భంగా, ఎంతో కీలకమైన ఈ ఒప్పందాల రూపకల్పనలో భారత్ పాత్ర అమోఘంగా వుండి ప్రపంచదేశాల ప్రశంసలందుకోవడం భారత్‌కే గర్వకారణం.

ఏదేమైనప్పటికీ, పారిస్ ఒప్పందాలు త్వరితగతిన ఆచరణలోకి రావాలనే ఆకాంక్షిద్దాం. సకల జీవరాశులకీ ఆవాసమైన ఈ నేలతల్లిని మనందరం కలిసి పరిరక్షించుకోవాలి. లేకుంటే భవిష్యత్తులో మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఆ ప్రమాదం నుంచి ముందే తేరుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ, మన ధరిత్రిని మనం కాపాడుకోవడం ద్వారా మనల్ని మనం కాపాడుకోవడం, భావితరాలకు చక్కని భవిష్యత్తునిస్తూ ఆదర్శంగా నిలవడం మనందరి తక్షణ కర్తవ్యం.

## చరిత్రాత్మకం



వాతావరణపరంగా వస్తున్న మార్పులతో భూమికి ఎలాంటి ముప్పు లేకుండా కాపాడుకునేందుకు ప్రపంచదేశాలన్నీ ఒక్కటికావడం, భూ తాపోన్నతిని 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ స్థాయికి పరిమితం చేద్దామంటూ పారిస్‌లో జరిగిన వాతావరణ శిఖరాగ్ర సదస్సులో 195 దేశాలు ప్రతిజ్ఞ చేయడం ప్రపంచస్థాయిలోనే ఒక అపూర్వ ఘట్టం. భూమండలం మీద వున్న వారందరికీ నిజంగా ఇదొక శుభవార్తే. ధరిత్రిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. ప్రపంచదేశాలన్నీ ధరిత్రి పరిరక్షణకు తీసుకున్న ఈ చరిత్రాత్మకమైన ఒప్పందాలు ఎంత త్వరగా ఆచరణలోకి వస్తే అంత మంచిది.

---

భగవద్గీతను

## జాతీయ గ్రంథంగా ప్రకటించాలి




కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నెల్లూరు శంకరాగ్రహారంలోని సురభి రామయ్య జ్యోతిషాలయంలో భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలి అనే అంశంపై సభ జరిగింది. గానరత్న పాటూరు శ్రీనివాసులు, బి.వి.నరసింహాలు ఉపన్యసించారు. ఈ సందర్భంగా షేక్ నజీర్‌బాషా గురూజీ భగవద్గీతపై ఉపన్యసించి భక్తులను ఆకట్టుకున్నారు. ట్రస్టు అధ్యక్షులు కేతా సుబ్బారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఐ డొనేషన్ ఛైర్మెన్‌గా బయ్యా ప్రసాద్



ఏపి ఆర్యవైశ్య మహాసభ నేత్రదాన కమిటి ఛైర్మెన్‌గా 2015-17 సంవత్సరానికి గాను బయ్యా ప్రసాద్‌ను ఏపి ఆర్యవైశ్య మహసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు నియమించారు. ఈ సందర్భంగా బయ్యా ప్రసాద్ మాట్లాడుతూ తన రెండు సంవత్సరాల పదవీ కాలంలో 13జిల్లాల్లో నేత్రదానంపై అవగాహన కల్పించి చూపులేని వారికి వెలుగు నింపుతానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

## అర్ధరాత్రి డిఎస్పీ తనిఖీలు

నెల్లూరు నగరంలో సోమవారం అర్ధరాత్రి నెల్లూరు నగర డిఎస్పీ వెంకటరాముడు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నాల్గవ నగర ఇన్స్‌పెక్టర్ సీతారామయ్య డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పలువురు మద్యం సేవించి వాహనాలను నడుపుతుండటంతో వారిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించి కేసులు నమోదు చేసారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నాల్గవ నగర సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో

## స్వచ్ఛభారత్

స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం పర్యాటకశాఖ, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత చేపట్టారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, పర్యాటకశాఖ జిల్లా మనేజర్ నాగభూషణం, రాజరాజేశ్వరి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పులి కోదండరామిరెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ, కార్పొరేటర్ రాజానాయుడు, రంగనాథస్వామి దేవస్థానం ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూర్ఖులారా... మారండి




ఏ మనిషయినా తనలో వున్న లోపాలను సరిదిద్దుకుంటూ మంచి పద్ధతులను అవలంబించడం నేర్చుకోవాలి. మేం గతంలో ఇలా ఉన్నాం, ఇప్పుడు కూడా అలాగే వుంటామంటే అంతకంటే మూర్ఖత్వం వుండదు. అగ్రవర్ణాలు తమ అహంకారాన్ని విడనాడాలని అందరూ కోరుకుంటున్నారు. మనుషులంతా సమానమేననే భావం అన్ని కులాల వారిలో వుంది. అలాంటప్పుడు కొన్ని కులాల వారు కొన్ని పద్ధతులు మార్చుకోవాలి. మేం గతంలో గొడ్డు మాంసం తిన్నాం, ఇప్పుడు కూడా అదే తింటాం అనే మూర్ఖపు మార్గం వద్దు. ఈ కులాల కంపును అలాగే వుంచాలని చూస్తున్న కంచె ఐలయ్య లాంటి మూర్ఖపు మేధావుల ఉచ్చులో పడొద్దు.

**- సి. పండరీసాయి, హైదరాబాద్.**

## కాంగ్రెస్‌కే చెల్లింది

వ్యక్తిగత సమస్యల కోసం పార్లమెంటును వాడుకోవడం కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుంది. నేషనల్ హెరాల్డ్ కేసు కోర్టుకు, సోనియా, రాహుల్‌గాంధీలకు సంబంధించిన అంశం. దీనికి పార్లమెంటుకు ఏం సంబంధం. తమ మీద కేసులను అడ్డం పెట్టుకుని సోనియా, రాహుల్‌గాంధీలు పార్లమెంటులో చర్చలను అడ్డుకోవడం ఎంతవరకు సబబు. కేసులను కోర్టుల్లో తేల్చుకోవాలి గాని పార్లమెంటులో కాదు.

**పైడిపాటి దయాకర్‌రెడ్డి, నెల్లూరు.**

## ఇకనన్నా మారదాం

మొన్న సూరత్, నిన్న నెల్లూరు, నేడు చెన్నై... ఈ వరదలన్నీ మనకేం చెబుతున్నాయో గుర్తించండి. ప్రకృతి జోలికి పోవద్దు. కాలువలను కాలువలుగానే, చెరువులను చెరువులుగానే వుంచుదాం. వాటిని ఆక్రమించుకుని కట్టడాలు చేయడం వల్లే నగరాలు మునిగిపోయే పరిస్థితి వచ్చింది. కాబట్టి ఇకనన్నా మేలుకొందాం. **- సంజీవ్, నెల్లూరు.**

## ఆయన ఆశీస్సులు డౌటే!

దలైలామా అమరావతిని కరుణిస్తాడా? డౌటే! బౌద్ధ సంస్కృతికి ఎక్కువ ప్రాధాన్యమిస్తున్న బాబు, రాజధాని శంకుస్థాపనకు వివిధ ప్రాంతాల నుండి మట్టి నీరు తెప్పించి, దలైలామాకు ప్రీతిపాత్రమైన ప్రదేశం టిబెట్టు నుండి మట్టి నీరు ఎందుకు తెప్పించలేదు? బౌద్ధ మతం అహింసకు ప్రాధాన్యమిస్తుంది. ముక్కారు పంటలు పండే భూములను రైతులను మానసికంగా హింసించి లాక్కోవడం, భూములను ఇవ్వని వారిని బెదిరించడం ఇవన్నీ దలైలామాకు సరిపడవు, అందుకే ఆయన ఆశీస్సులు డౌటే!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## బీజేపీ అధ్యక్ష పదవి

ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి సామాన్య కార్యకర్తలా పార్టీని నడిపించాడు. మిడతల రమేష్ ఎంతోకాలం నుండి పార్టీని కనిపెట్టుకుని ఉన్నాడు. బి.సి. కులస్థుడు. అన్ని పార్టీలకు బిసి నాయకులు అధ్యక్షులుగా వున్నారు. బీజేపీ కూడా జిల్లా అధ్యక్షుడిగా బిసి వర్గానికి చెందిన మిడతల రమేష్‌ను నియమించాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**



## జగత్ కల్యాణమే ధ్యేయంగా...

# శ్రీవిద్యా మహాయాగం



- 25 నుంచి జనవరి 4 దాకా శ్రీ లలితాంబికా దేవి ఆరాధన
- తమిళనాడులోని తిరుఇంగోయిమలైలో భారీ ఏర్పాట్లు
- వేద మంత్రాలతో మారుమ్రోగనున్న 'ఛాయాపుర శక్తిపీఠం'
- ఇది ప్రపంచంలోనే తొలి బృహత్తర యాగం

*శ్రీవిద్యాం పూర్ణమేరుశిఖరే బిందు త్రికోణేస్థితాం*
*వాగీశాది సమస్త భూత జననీం మంచే శివాకారకే ॥*

**ఈ విశ్వ సృష్టికీ..సకల చరాచర ప్రకృతికీ మూలకారణమూ.. మూలాధారమూ అయిన ఆ మహాశక్తి స్వరూపిణి ఎవరో కాదు..ఆ జగదాంబే. ఇచ్ఛాశక్తి.. జ్ఞానశక్తి.. క్రియాశక్తి స్వరూపిణి.. చిన్మయరూపిణి అన్నీ ఆ జగన్మాతే. ఆదిశక్తి.. పరాశక్తి అన్నీ ఆ శక్తి స్వరూపాలే. అణువు నుంచి బ్రహ్మాండం దాకా, పరమాణువు నుంచి పంచభూతాల దాకా అంతా ఆ మహాదేవి తేజస్వరూపాలే. ఆ భగవత్శక్తిని ఏ పేరున పిలిచినా..ఏ పేరున తలచినా.. ఏ రూపాన కొలిచినా అన్నీ జగదేకమాత అయిన ఆ శ్రీ లలితాంబకే చెందుతాయి. అందుకే దేవీ ఉపాసకులు ఆ మహాశక్తినే దివ్యశక్తిగా.. సర్వశక్తి సమన్వితగా భావించి సతతం నిష్ఠతో అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా..ఆర్తులపాలిట దయామయిగా ప్రసిద్ధి చెందిన శ్రీ లలితాంబికను ఆరాధించే భక్తులు విశ్వవ్యాప్తంగా భారీసంఖ్యలోనే వున్నారు. వారందరికీ ఇది శుభవార్తే. శ్రీ లలితాంబికా అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన ఒక బృహత్తర యాగం ఈ నెల 25 నుంచి జనవరి 4వ తేది వరకు తమిళనాడులో అత్యంత వైభవోపేతంగా జరుగనుంది. ఆ మహాయాగం పేరే "శ్రీవిద్యా మహాయాగం". ఈ యాగంతో పాటు, శ్రీవిద్యా ఉపాసకుల ఆరాధన కూడా ఎంతో ఘనంగా నిర్వహించనున్నారు.**

*"మహాతంత్రా మహామంత్రా మహాయంత్రా మహాసనా*
*మహాయాగ క్రమారాధ్యా మహాభైరవ పూజితా"..*

అని శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం పేర్కొంటోంది. ఇందులోని 'మహాయాగ క్రమారాధ్యా' అనే నామధేయం అమ్మవారికి ఎంతో ప్రీతికరమైనదిగా దేవీ ఉపాసకులు భావిస్తారు. ఈ మహాయాగం కూడా సాక్షాత్తూ అమ్మవారి మహారాధనలో భాగమే. శ్రీ లలితా మహాదేవిని మహాయాగ సేవతో ఆరాధిస్తే ఆ జగదంబ ఎంతో సంతృప్తి చెందుతుందని, తద్వారా లోకానికి శుభం చేకూరి లోకకల్యాణం జరుగుతుందని, ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లుతుందని భక్తులు మనసా వాచా విశ్వసిస్తుంటారు. అందుకే, జగత్కల్యాణమే ధ్యేయంగా శ్రీవిద్యా ఉపాసకులు, నిర్వాహకులంతా ఈ మహత్తర మైన మహాయాగాన్ని భారీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

### వేదమంత్రాలతో మారుమ్రోగనున్న 'ఛాయాపుర శక్తిపీఠం':

తమిళనాడు, తిరుచిరాపల్లి సమీపంలోని కావేరీ నదీ తీరాన వున్న "తిరుఇంగోయిమలై" అనే పుణ్యక్షేత్రంలో, 51 శక్తిపీఠాల్లో 50వ శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందిన ఈ పవిత్రస్థలంలో, 'ఛాయాపుర శక్తిపీఠం'గా ఆరాధనీయమైన శ్రీ లలితా మహిళా సమాజం ప్రాంగణమే వేదికగా ఈ మహాయాగ మహోత్సవం జరుగనుంది. ఎంతో నియమనిష్ట లతో, అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ మహాయాగాన్ని ఆద్యంతం అద్భుతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కోటీ ఇరవై లక్షల సార్లు శ్రీవిద్యా పవిత్ర మంత్రాన్ని జపించి, దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా పర్యటించి అనేక యాగాలు, కుంభాభిషేకాలు నిర్వహించి, శ్రీ లలితాంబికా దేవి తత్వాన్ని-మహత్వాన్ని లోకానికి చాటుతూ, లోకకల్యాణమే ధ్యేయంగా నిరంతరం ఆ లోకమాతను సేవిస్తూ, దైవాంశ సంభూతురాలైన శ్రీల శ్రీ మాతాశ్రీ యోగినీ శ్రీవిద్యాంబ సరస్వతీ నేతృత్వంలో ఈ మహాయాగాన్ని నిర్వహించనుండడం అపూర్వమైన విషయం. సమాజంలో మంచిని-మానవతను పెంపొందించడం కోసం, ఎల్లెడలా భక్తితత్పరతను, ధార్మిక భావాలను ద్విగుణీకృతం చేసి, సదాశయాలు సద్భావనలే మానవ గమ్యాలుగా ఎంచి, విశ్వశ్రేయస్సే పరమావధిగా భావించి మానవజీవితాలకు పరిపూర్ణతను, సార్ధకతను చేకూర్చడం కోసం ఈ పవిత్ర స్థలంలో వెలసిన శ్రీ లలితా మహిళా సమాజం ఎంతోకాలంగా నిర్విరామ కృషి చేస్తూనే వుంది. ఈ కృషిలో భాగంగానే ఆ దేవీ అనుగ్రహంతో ఈ మహాయాగాన్ని ఆద్యంతం భక్తిభావసమన్వితంగా నిర్వహించాలనే సంకల్పంతో నిర్వాహ కులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ప్రపంచంలోనే ఇది తొలి బృహత్తర యాగం :

సర్వమంత్ర స్వరూపిణి అయిన శ్రీ లలితాంబికా ఆరాధనలో భాగంగా జరిగే ఈ మహాయాగ మహోత్సవం ఎంతో విశిష్టమైనది. ఈ యాగంతో, దేవీ ఉపాసనలోనే జీవితాలను ధన్యత చేసుకుంటున్న ఎంతోమంది విశిష్ట ఉపాస కులతో తిరుఇంగోయిమలై కళకళలాడనుంది. పరమ నియమ నిష్టాగరిష్టులైన వందలాదిమంది దేవీ ఉపాసకుల వేదనాదా లతో, విశిష్టమైన మంత్రోచ్ఛటనలతో, మంగళవాయిద్యాలతో ఈ పవిత్రక్షేత్రం మారుమ్రోగనుంది. మహాగణపతి పూజ, శ్యామలాదేవి పూజ, తదితర అన్ని రకాల న్యాసపూజలతో,



అమ్మవారికి ప్రీతికరమైన పూజలు, సేవలతో..వేదనాదాలతో ఇలాంటి మహాయాగం జరగడం ప్రపంచంలోనే బహుశా ఇదే తొలిసారి అనే చెప్పవచ్చు. ప్రాచీనకాలంలో 1690-1785 ప్రాంతంలో ప్రఖ్యాత దేవీ ఉపాసకుడైన భాస్కరరాయ తొలిసారిగా శ్రీ లలితాసహస్ర నామాలకు భాష్యం రచించారు. వేదవేదాంగవేత్త అయిన శ్రీ భాస్కరరాయ ఆ కాలంలో జగన్మాత శ్రీ లలితాంబికా దేవిని ఆరాధిస్తూ ఇలాంటి యాగం చేశారని భక్తులు పేర్కొంటుంటారు. ఆ తర్వాత కాలంలో, ఇప్పుడు అమ్మవారికి ఇంత మహత్తరంగా మహాయాగం నిర్వహించడం ఇదే తొలి సారిగా భావించవచ్చు. అందుకే, ఎంతో పవిత్రమూ, మహ త్తరమూ-బృహత్తరమూ అయిన ఈ మహాయాగంలో పాల్గొన డాన్ని భక్తులందరూ ఒక మహద్భాగ్యంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. శ్రీ లలితాంబికా దేవి ఆరాధనను అమ్మవారి సేవగా భావించి.. కనులారా తిలకించి తరిస్తారు. కాగా, ఈ సందర్భంగా ప్రత్యక్షదైవమైన శ్రీల శ్రీ మాతాజీ సారధ్యంలో, శ్రీవిద్యా మహాయాగ కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమంది దేవీ ఉపాసకులకు అవసరమైన వసతి, భోజన సదుపాయాలను కూడా చేస్తున్నారు.

### 25 నుంచి మహాయాగం ప్రారంభం :

డిసెంబరు 25 నుంచి జనవరి 4వ తేది వరకు ఈ మహాయాగం జరుగుతుంది. ఈ సందర్భంగా అమ్మవారికి విశిష్టమైన యాగాలు, పూజలు చేస్తారు. 25వ తేది శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గోమాత పూజ, సూర్యపూజలు చేసి, యాగకుండాన్ని శుద్ధి చేసి ఈ మహాయాగం ప్రారంభిస్తారు. జనవరి 4న అమ్మవారికి ప్రత్యేకపూజలతో యాగం ముగియ నుంది. అనంతరం శ్రీల శ్రీ మాతాజీ అందరికీ ఆశీస్సులు అందజేస్తారు. ఈ యాగం సందర్భంగా డిసెంబరు 25 నుంచి జనవరి 2వ తేది వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల దాకా శ్రీ లలితా సహస్రనామ స్తోత్రాన్ని పారాయణం చేస్తారు. అఖండ నామజపంతో అమ్మవారిని ఆరాధిస్తారు. శ్రీవిద్యా మహాయాగ కమిటీ అధ్యక్షురాలు శ్రీల శ్రీ మాతాశ్రీ యోగిని శ్రీవిద్యాంబ సరస్వతి, ఉపాధ్యక్షురాలు యోగిని శాంభవి విద్యాంబ, కార్యదర్శి యోగిని శివశంకరి అంబ, సహాయ కార్యదర్శి యోగిని జయాంబ, కోశాధికారి యోగిని బాలాంబతో పాటు అనేకప్రాంతాల నుంచి అమ్మవారి భక్తులు, సభ్యులుగా ఈ కమిటీలో వున్నవారంతా ఈ యాగాన్ని ఆద్యంతం భక్తిశ్రద్ధ లతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక యాగ కుండాలను ఏర్పాటు చేసి ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది శ్రీవిద్యా ఉపాసకులతో వైభవంగా నిర్వహించే ఈ మహాయాగ మహోత్సవం కోసం దాదాపు 2కోట్ల రూపాయల దాకా వ్యయం కావచ్చని భావిస్తున్నారు. దాతలు, భక్తులు ఇచ్చే విరాళాలతో పాటు యాగ కార్యక్రమాల నిర్వహణతో వచ్చే మొత్తంతో ఈ బృహత్తర మహాయాగాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.

### ప్రఖ్యాత స్వామీజీల రాక :

తమిళనాడులోని తిరుఇంగోయిమలైలో అద్భుతంగా జరుగనున్న శ్రీవిద్యా మహాయాగానికి పలు రాష్ట్రాలలోని ప్రసిద్ధ ఆశ్రమాల నుంచి ప్రముఖ స్వామీజీలు, శ్రీవిద్యా ఉపాసకులు సైతం ముఖ్య అతిథులుగా విచ్చేస్తుండడం విశేషం. పూజనీయ శ్రీల శ్రీ మాతా అమృతానంద మయిాదేవి (కేరళ), పూజనీయ పరమహంస పరివ్రాజక ఆచార్య స్వామీ నిరంజనానంద సరస్వతి (బీహార్), పూజనీయ పరమహంస స్వామి సత్సంగానంద సరస్వతి (జార్ఖండ్), పూజనీయ శ్రీ జయేంద్రపురిస్వామి (కర్నాటక) లతో పాటు, విశ్వహిందూపరిషత్ అంతర్జాతీయ నేత శ్రీ ప్రవీణభాయి తొగాడియా, కేంద్రమంత్రి శ్రీ రాధాకృష్ణన్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.రంగస్వామి, భువ నేశ్వర్‌లోని శ్రీవిద్యా సంస్కృత సంస్థాన్ నుంచి శ్రీ మహా మేధానంద సరస్వతి తదితర ప్రముఖులు విచ్చేయనున్నారు.

### భక్తిభావ సమన్వితంగా సాంస్కృతిక కార్యక్రమాలు :

ఈ మహాయాగం సందర్భంగా ఈ నెల 27వ తేది నుంచి భక్తిభావసమన్వితమైన సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో నెల్లూరు కళాకారులు కూడా పాల్గొనడం సింహపురి అదృష్టమనే చెప్ప వచ్చు. డిసెంబరు 30,31 తేదీల్లో జరిగే శాస్త్రీయ సంగీత విభావరిలో 'సంకీర్తన కోకిల' బిరుదాంకితురాలైన ప్రముఖ గాయని జె.బాలార్క బృందం, శాస్త్రీయ నృత్యాల్లో ప్రసిద్ధి చెందిన గురుకృప కళాక్షేత్రం చిన్నారులు, 'వీణ త్రయం'గా పేరొందిన శ్రీమతి హేమలక్ష్మి పాలేటి, శ్రీమతి పి.పద్మాచక్రవర్తి, శ్రీమతి ఎస్.నాగ లక్ష్మి ఈ మహోత్సవంలో తమ కళాప్రతిభను చాటనున్నారు.

ఏదేమైనా, ఈ మహాయాగం యాగాలన్నిటిలోనూ ఎంతో బృహత్తరమైనదని, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వున్న శ్రీవిద్యా ఉపాసకులు, అమ్మవారి భక్తులందరూ తమిళనాడులోని తిరుఇంగోయిమలైలో నభూతో న భవిష్యతి.. అనే రీతిలో జరుగనున్న ఈ పవిత్రమైన, మహామహిమాన్వితమైన 'శ్రీవిద్యా మహాయాగం'లో పాల్గొని యాగమహోత్సవాన్ని కనులారా తిలకించి తరించాలని, తద్వారా శ్రీ లలితాంబికా అమ్మవారి కరుణా కటాక్ష వీక్షణాలకు అందరూ పాత్రులు కావాలని నిర్వాహకులు నిండుమనసుతో కోరుతున్నారు.

*శ్రీ లలితా భక్తుల హృదయాది దేవత - శుభములనొసగే శుభలలితా*
*కామితార్ధములనిచ్చి కరుణతో - కాపాడు చల్లని తల్లి!*

### జాతీయ కరాటే పోటీలలో

# సత్తాచాటిన వాత్సల్య విద్యార్థి



ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగిన 6వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో నెల్లూరు, కొండాయపాలెంరోడ్డులోని జనహిత వాత్సల్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి సి.హెచ్.చందు అత్యుత్తమ ప్రతిభ కనపరిచాడు. అండర్-14 విభాగంలో చందు ప్రథమస్థానం సాధించాడు. 14వ తేదీ స్కూల్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో సంస్థ గౌరవాధ్యక్షులు సామంతు గోపాలరెడ్డి, కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ టివిఎస్ దుర్గాప్రసాద్, హెడ్మాస్టర్ మధుసూదన్‌రెడ్డి, కరాటే మాస్టర్ ఇబ్రహీంలు చందును అభినందించారు.

# దోర్నాలకు 'కళా'భినందనలు



తెలుగుదేశంపార్టీ సాంస్కృతిక విభాగంలో వుంటూ పార్టీకి ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న టీవీ నటుడు దోర్నాల హరిబాబును సోమవారం నెల్లూరులోని తెలుగుదేశం కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావు సత్కరించారు. హరిబాబు ఇటీవల అమెరికాలోని డల్లస్, డెట్రాయిట్ రాష్ట్రాలలో "నవ్వుల హరివిల్లు" ప్రదర్శనలిచ్చి అక్కడి వారిని నవ్వుల్లో ముంచెత్తి వచ్చిన సందర్భంగా ఈ అభినందన సత్కారం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పార్టీ నాయకులు జి.నాగేశ్వరరావు, చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

# వైయస్సార్ విద్యార్థి సంతకాల సేకరణ



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా వై.యస్.ఆర్. విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నెల్లూరు రామలింగాపురం సెంటర్ వద్ద సంతకాల సేకరణ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మధన్‌కుమార్ రెడ్డి, నగర అధ్యక్షుడు విశ్వరూపాచారి మాట్లాడుతూ 2014సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలలో ముఖ్యంగా విద్యార్థుల కోసం, నిరుద్యోగుల కోసం ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, దానికి నిరసనగా రాష్ట్రం మొత్తం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరుద్యోగుల దగ్గర, విద్యార్థుల దగ్గర సంతకాలు సేకరించి ఆ సంతకాలను ఎన్నికల అధికారికి పంపిస్తామని అప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరచి నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.2000లు నిరుద్యోగ భృతిని ఇవ్వాలన్నారు. డియస్సీ పోస్టుల భర్తీ, ఉద్యోగాల నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం నగర కార్యదర్శి హరికృష్ణారెడ్డి, నాయకులు సాధిక్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మన్సూర్, విజయ్, శాభూ, తరుణ్, అంకయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# విఆర్‌సిలో ఎన్‌సిసి స్వచ్ఛభారత్



నెల్లూరులోని విఆర్ కళాశాలలో ఆర్మీ మరియు నేవల్ ఎన్‌సిసి కేడట్స్ ఈనెల 13న స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో వున్న చెత్తను ఏరేసారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాబు ఎన్‌సిసి కేడట్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వచ్ఛభారత్ కోసం అందరం కృషి చేయాలని ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించిన స్వచ్ఛభారత్ ఉద్యమంలో అందరం భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్స్ కెప్టెన్ కె.శ్రీనివాసులు, సబ్‌లెఫ్టినెంట్ డాక్టర్ ఎన్.ప్రభాకర్, లెక్చరర్ గరుడేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# కాల్‌మనీపై కన్నెర్ర

నెల్లూరు కబుర్లు



విజయవాడలో వెలుగులోకి వచ్చిన 'కాల్‌మనీ' దారుణాల ఉదంతంతో అన్ని జిల్లాల్లోనూ ప్రకంపనలు రేగాయి. నెల్లూరులోనూ పోలీసులు దీనిపై అలర్ట్ అయ్యారు. ఎందుకంటే కాల్‌మనీ తరహా తండల్ కేసులు నెల్లూరు జిల్లాలోనూ ఎక్కువుగానే వున్నాయి. నెలవారీ పద్ధతుల్లో వడ్డీలకు అప్పులు తీసుకోవడం ఒక విధానం. ప్రైవేట్‌గా రూపాయిన్నర నుండి ఐదు రూపాయల దాకా వడ్డీలు నడుస్తుంటాయి. ఈ వడ్డీలు కట్టలేకే నెల్లూరులో చాలా మంది వ్యాపారులు దివాళా తీసారు. రియల్టర్లు అయితే ఐపిలు కూడా పెట్టారు. కొన్నిచోట్ల కోట్ల రూపాయల ఆస్తులు వడ్డీలకే కరిగిపోయాయి. నెలవారీ వడ్డీలన్నా ఒకరకంగా నయం. తండల్ సిస్టంలో రోజువారీ వడ్డీలుంటాయి. టీ కొట్లు, టిఫిన్ బండ్లు, రిక్షావాలాలు... ఇంకా సన్న, చిన్న వ్యాపారులు తమ సంపాదనంతా ఈ తండల్‌కే ధారబోస్తుంటారు. ఉదయం వందరూపాయలు అప్పు తీసుకుంటే సాయంత్రం నూటపదిరూపాయల లెక్కన తిరిగి చెల్లించే విధానం ఇది. సన్న వ్యాపారుల కష్టమంతా ఈ తండల్ వ్యాపారులే పిండేస్తుంటారు. నెల్లూరులోనూ పోలీసులు తండల్ వ్యాపారులపై దృష్టిపెట్టారు. పలు ఫైనాన్స్ కంపెనీలలో సోదాలు చేపట్టారు. బాధితులు ఫిర్యాదు చేస్తే తండల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవడానికి రెడీ అంటున్నారు.

# దేశంలోకి ఇసనాక



సూళ్లూరుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ జీరో అయినట్లయ్యింది. ఇప్పటిదాకా ఆ పార్టీలో మిగిలి వున్న ఒకే ఒక్క నాయకుడు, శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌ను వీడారు. 14వ తేదీ మందీమార్భలంతో తన అనుచరగణంతో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్ సమక్షంలో ఆ పార్టీలో చేరిపోయారు. దీంతో కాంగ్రెస్‌కు వున్న ఒక్క ఆధారమూ పోయింది. సూళ్లూరుపేట మండలం కోటపోలూరుకు చెందిన హర్షవర్ధన్ రెడ్డికి నియోజకవర్గంలో సౌమ్యుడిగా, మంచి వ్యక్తిగా పేరుంది. రెండు దఫాలుగా ఆయన చెంగాళమ్మ దేవస్థానం ఛైర్మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఆలయం అభివృద్ధికి కృషి చేసారు. జిల్లాలో ఆనం సోదరులతోనూ, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డితోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆయన చక్రం తిప్పబట్టే వైకాపాకు సూళ్లూరుపేట మున్సిపాల్టీ దక్కలేదు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిని ఛైర్‌పర్సన్ చేయడంలో ఆయన సహకారం ఎంతగానో ఉపకరించింది. 2014 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్సీగా వున్న వాకాటి నారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరారు. అయితే ఇసనాక అప్పుడు చేరలేదు. అయినా కాంగ్రెస్‌కు దూరంగానే వుంటు న్నారు. ఇక ఎట్టకేలకు ఎన్నో ఏళ్ల బంధాన్ని తెంపుకుని తెలుగుదేశంలో చేరిపోయారు.

# రాష్ట్ర స్థాయికి డా॥ కిషోర్స్ రత్నం విద్యార్థులు



నేషనల్ సైన్స్ కాంగ్రెస్ వారు గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 10న నిర్వహించిన వివిధ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో నెల్లూరుజిల్లా నుండి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు 8ప్రాజెక్టులు ఎంపిక కాగా, అందులో 3సైన్స్ ప్రాజెక్టులు డా॥ కిషోర్స్ రత్నం స్కూలు విద్యార్థులవని స్కూలు డైరెక్టర్లు కె.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు తెలిపారు. ఇందులో సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్‌రత్నం స్కూలు విద్యార్థులు 'హార్వెస్టింగ్ ఆఫ్ రైన్‌వాటర్ అండ్ రీయూజ్' టాపిక్‌తో శీర్షికారెడ్డి టీం లీడర్‌గా శ్రేయారెడ్డి, వెంకట కీర్తి సాత్విక, శశిప్రీతి సభ్యులుగా ప్రదర్శించిన ప్రాజెక్టు, మాగుంట లే అవుట్‌లోని విజన్ స్కూలు విద్యార్థులు జూమ్‌కల్టివేషన్ టాపిక్‌తో కె.శ్రీచరణ్ టీం లీడర్‌గా బ్రిషిత, శివాని, శ్రవంత్, గురుప్రీతమ్ సభ్యులుగా ప్రదర్శించిన ప్రాజెక్టు, సరస్వతినగర్‌లోని డా॥ సి.వి.రామన్ విద్యార్థులు అబ్జర్వేషన్ ఆఫ్ థన్‌డర్‌స్ట్రామ్ అండ్ అసెసింగ్ ఇంపాక్ట్ ఆన్ హ్యూమన్ ఆక్టివిటి టాపిక్‌తో పవన్ టీం లీడర్‌గా, శ్రావణి, శ్రీనిజ, దీప్వి, మణిదీప్‌లు సభ్యులుగా ప్రదర్శించిన ప్రాజెక్టు మొత్తం 3ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో డా॥ కిషోర్స్‌రత్నం జెన్‌నెక్ట్స్ స్కూల్స్ జనరల్‌మేనేజర్ రామమూర్తినాయుడు మాట్లాడుతూ ప్రకృతిని సద్వినియోగ పరచుకోవడం, సమాజానికి ఉపయోగపడేలా వివిధ సైన్సు ప్రాజెక్టులు రూపొందించడం నేటి విద్యార్థుల కర్తవ్యం కాబట్టి విద్యార్థులు ఎప్పటికప్పుడు వినూత్న ప్రాజెక్టుల రూపకల్పన చేస్తూ భవిష్యత్తులో గొప్ప సైంటిస్టులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కె.మనోజ్‌కుమార్, కళ్యాణి, సుప్రియ, ఎఓ రుక్మిణి, మేనేజర్ రాజేష్‌బాబు, రాధాకృష్ణ, కమల్‌సింగ్, కిరణ్, విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎముకలు, కీళ్ల వైద్యులు డాక్టర్ ఎంఎవివి ప్రసాద్ ఎన్నికయ్యారు. 15వ తేదీ నెల్లూరు ఐఎంఏ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధానకార్యదర్శిగా డాక్టర్ భక్తవత్సలం, కోశాధికారిగా డాక్టర్ సుస్మితలను ఎన్నుకున్నారు.

# ఉచిత సివిల్ శిక్షణకు దరఖాస్తులు

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ నిమిత్తం ఉచిత కోచింగ్ కొరకు ఎస్సీ, ఎస్టీ, బిసిలకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుండి కామన్ స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరుకావడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ నిమిత్తం ఈ నెల 31లోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కామన్ స్క్రీనింగ్ టెస్ట్ అన్ని జిల్లాలో జరుపబడుతుంది. ఫిబ్రవరి 1 నుండి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలలో శిక్షణ మొదలవుతుందని వివరాలకు 0861-2338300, 9700036599 నెంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

### రంగనాధస్వామికి

# అధ్యయనోత్సవాలు

నెల్లూరులోని రంగనాయకులపేటలో కొలువై వున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ తల్పగిరి రంగనాధస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13 వ తేదీ రాత్రి స్వామివారు శ్రీ కోదండ రాముని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో వేడుకగా జరుగుతున్నాయి.

### వాసవి క్లబ్‌కు

# నాలుగు అంతర్జాతీయ అవార్డులు

వాసవి క్లబ్ నెల్లూరుకు వాసవి ఐకాన్ అంతర్జాతీయ సదస్సులో నాలుగు అంతర్జాతీయ అవార్డులు లభించాయి. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఈ నెల 13న రాత్రి జరిగిన వాసవి ఐకాన్ అంతర్జాతీయ సదస్సులో, నెల్లూరుకు చెందిన గంపా నాగేశ్వరరావుకు అత్యుత్తమ సేవా అవార్డును, శాశ్వత సేవా అవార్డును, నూరుశాతం సభ్యుల అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా శాఖ అధ్యక్షులు పేరూరి మల్లికార్జునరావు మాట్లాడుతూ, నెల్లూరు వాసవి క్లబ్‌కు ఇంతటి విశిష్టమైన నాలుగు అవార్డులు లభించడం ఎంతో సంతోషకరమన్నారు. ఇదే స్ఫూర్తితో వాసవి క్లబ్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా కార్యదర్శి ఆర్.జగన్మోహన్, కోశాధికారి గోపీ కృష్ణ, సభ్యులు చైతన్య, చరణ్, హరి తదితరులు పాల్గొన్నారు. సేవా రంగంలో ముందుంటూ అంతర్జాతీయ స్థాయిలో నాలుగు విశిష్టమైన అవార్డులను అందుకున్న వాసవి క్లబ్-నెల్లూరుకు 'లాయర్' శుభాభినందనలు.

# నీళ్ల సమావేశంలో నిప్పులు

## తెదేపా, వైకాపా సభ్యుల మధ్య మాటల యుద్ధం





ఎన్నో ఏళ్లకు జిల్లాలో మంచిగా వానలు పడ్డాయి. చెరువులు నిండాయి. సోమశిల, కండలేరు రిజర్వాయర్‌లు నిండి రెండేళ్ల రైతుకు భరోసానిస్తున్నాయి. ఈ వర్షాల పుణ్యమా అని తెలుగుదేశం నాయకులు రైతుల ముందు కాలర్ ఎగరేస్తున్నారు. ఎన్ని నీళ్లు కావాలన్నా ఇస్తాం, ఇక ధోకా ఏముందంటూ ఈ నెల 11వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీ హాల్‌లో జిల్లా సాగునీటి సలహా కమిటీ సమావేశం పెట్టారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్దా రాఘవరావు, మున్సిపల్ మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ ఎం.జానకి, ఇరిగేషన్ ఎస్‌ఇ సుబ్బారావు, జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, మేకపాటి గౌతంరెడ్డిలు హాజరయ్యారు. సమావేశం ప్రారంభమై మంత్రులు ఈ జిల్లాలో నీళ్లను వెల్లువలా పారిస్తాం, పంటలను పుష్కలంగా పండిస్తామని చెబుతున్న తరుణంలో నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ ఆక్రమణల తొలగింపు ప్రస్తావన తెచ్చారు. మొన్నటి వరదలు పంటకాలువల ఆక్రమణల వల్లేనని మంత్రి నారాయణ చెప్పారని, నగరంలో 5వేల మంది పేదల ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారని, మరి సర్వే నెంబర్ 994లో వున్న మంత్రి నారాయణ కాలేజీ ఆక్రమణ సంగతి ఏంటని అనిల్ నిలదీశారు.

దీనికి మంత్రి మౌనంగానే వున్నా, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెచ్చిపోయారు. ఆయనకు ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి కూడా జత కలిసారు. ఈ పక్క అనిల్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు జత కలిసారు. ఇరువురి మధ్య మాటలు తూటాల్లా పేలాయి. రేయ్.... ఏయ్... దమ్ముంటే బయటకురా, తేల్చుకుందాం... నోరు అదుపులో పెట్టుకో... ఈ మాటలతో సమావేశం ఒక యుద్ధ వాతావరణాన్ని తలపించింది. తర్వాత అటు ఇటు కొందరు సర్దిచెప్పడంతో ప్రజాప్రతినిధులు శాంతించి తమ స్థానాల్లో కూర్చున్నారు. తర్వాత జిల్లాలో సాగునీటి పంపిణీపై చర్చించి ఈ నెల 18 నుండి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. పెండింగ్‌లో వున్న వివిధ కాలువల పనులను పూర్తి చేయాలని, పెన్నకు కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేయాలని, జిల్లాలో 10లక్షల ఎకరాల్లో పంటలకు నీళ్లివ్వాలని నిర్ణయించారు.

## శ్రీసిటీలో ఎయిర్‌టెల్ 4జీ సేవలు




నెల్లూరుజిల్లా తడ సమీపంలోని ప్రముఖ పారిశ్రామిక వాడ శ్రీసిటీ సెజ్‌లో ఎయిర్‌టెల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎయిర్‌టెల్ సిఇఓ వెంకటేశ్ విజయ రాఘవన్, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ 4జీ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవన్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటిగా 4జీ సర్వీసును ప్రారంభించిన ఘనత ఎయిర్‌టెల్‌దేనన్నారు. దేశవ్యాప్తంగా 294నగరాలు, ఆంధ్ర రాష్ట్రంలో 6నగరాల్లో 4జీ సేవలు అందుబాటులోకి రాగా, నగరాలకు సంబంధంలేని చోట ప్రప్రథమంగా శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఈ సేవలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇక్కడ అభివృద్ధి బాగుందని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌టెల్ మార్కెటింగ్ మేనేజర్ నరేంద్ర వర్మ, సిఇఓ చంద్రకాంత్ త్రిపాఠి, అనూష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికే పాపం తెలియదు

### వెనకేసుకొచ్చిన వివేకా



మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సోమవారం నెల్లూరు ఏసి సెంటర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టారు. ఆయన మాట్లాడిన మాటలకు విలేకరులకే దిమ్మ తిరిగిపోయింది. ఆయన మాట్లాడిన సబ్జెక్ట్ వచ్చి మంత్రి నారాయణకు చెందిన నారాయణ మెడికల్ కాలేజీని పంట కాలువను ఆక్రమించి కట్టారని ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు చేస్తున్న ఆరోపణల మీద! నెల్లూరు నగరంలో పంట కాలువల ఆక్రమణలను తొలగించాలంటే ముందుగా నారాయణ మెడికల్ కాలేజీ వద్ద నుండే మొదలుపెట్టాలని ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తుండడమే కాక, విలేకరులను కూడా వెంటబెట్టుకుని పోయి ఆ కాలువను చూపించారు. దీనిపై ఎప్పటినుండో తెలుగుదేశంలో వున్న నాయకులెవరూ స్పందించ లేదు. అసలు మంత్రే పట్టించుకోలేదు. వివేకా మాత్రం గట్టిగా స్పందించారు. నారాయణ మీద ఈగ వాలినా ఒప్పుకోనన్నట్లు బదులిచ్చాడు. గట్టిగా నెలక్రితం ఆయనే నారాయణను తిట్టి వుంటాడు. తెలుగుదేశం పార్టీలో అలా చేరాడోలేదో నారాయణ భజనందుకున్నాడు. అది పంటకాలువ కాదని, ఊటకాలువ అని, అయినా చింతారెడ్డిపాలెం రైతులకు లేని దురద మీకెందుకని ఎమ్మెల్యేలను ప్రశ్నించాడు. కాలువను ఆక్రమించుకుని కాలేజీలను కట్టుకునేంత దుర్మార్గుడు కాదని, ఎంతో మందికి విద్యాదానం చేసిన విద్యావేత్త అని నారాయణను కొనియాడారు. సర్వే నెంబర్ 994లో ఇప్పటికీ ఊటకాలువ వుందని, ఆ కాలువ క్రింద తాను కూడా సేద్యం చేస్తుంటానని ఆయన చెప్పుకొచ్చారు. వేలమంది రోగులు, వందలాదిమంది విద్యార్థులు వుంటున్న నారాయణ విద్య, వైద్య సంస్థలపైకి ఎమ్మెల్యేలు తమ అనుచరులతో వెళ్లి వారిని భయాందోళనలకు గురిచేయడం మంచిపద్ధతి కాదన్నారు. నెల్లూరు నగరంలో దశాబ్దాల క్రిందట పూడిపోయిన కాలువలను తిరిగి తెరిపించడం సాధ్యం కాదని, దీనివల్ల ఎవరికి కూడా ఉపయోగం లేదని ఆయన పేర్కొన్నారు.

## మనస్సును రంజింపజేసేదే కవిత్వం

### 'పూవులు సమ్మె చేస్తాయి' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో సినీ రచయిత వెన్నెలకంటి





పద్యానికి సాహిత్యంలో ప్రథమస్థానం ఉందని ఆ తర్వాతి స్థానమే వచన కవిత్వానిదని, అంత మాత్రం చేత వచన కవిత్వం తీసిపోదని ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి అన్నారు. వస్తువులో కవిత్వీకరణ లేకపోతే అది వచనకవిత్వమనిపించుకోదన్నారు. ఈ సందర్భంగా గుంటూరు శేషేంద్రశర్మ వ్రాసిన కవితను చదివి వినిపించారు. ఏటూరి నాగేంద్రరావు రచించిన 'పూవులు సమ్మె చేస్తాయి' కవితాసంపుటి ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏటూరి మంచి కవిత్వం వ్రాసారని, పుస్తకానికి పెట్టిన పేరు చూస్తే ఆ కవిత్వం ఎలాంటిదో చెప్పవచ్చన్నారు.

నెల్లూరు టౌన్‌హాల్ రీడింగ్ రూంలో పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ఏటూరి నాగేంద్రరావు రచించిన 'పూవులు సమ్మె చేస్తాయి' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ముక్కుంటే ముక్కెర ఉచితం కవితను ఊటంకిస్తూ అద్భుతమైన హాస్యాన్ని కవితలో పండించారన్నారు. ఏటూరికి ఉజ్వలమైన భవిష్యత్తుందన్నారు. నెల్లూరు మాండలికంతో కవితల పోటీ జరిగితే తనవంతు సహాయసహకారాలు అందజేస్తానన్నారు.

సభకు అధ్యక్షత వహించిన చిన్ని నారాయణరావు మాట్లాడుతూ 19వ శతాబ్దిలో వచన కవిత్వం ప్రాచుర్యం పొందిందని, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ, శ్రీశ్రీ, శిష్లా, నారాయణబాబులు వచన కవితోద్యమానికి పాటుపడ్డారన్నారు. ఏటూరి నాగేంద్రరావు కవులకు కవి అని ప్రశంసించారు. ప్రముఖ రచయిత్రి పెళ్లకూరు జయప్రద, కావలి మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, డాక్టర్ ఈదూరు సుధాకర్‌లు పాల్గొన్నారు. ప్రముఖకవి శ్రీరామకవచం సాగర్ కవితా సంపుటిని సమగ్రంగా సమీక్షించారు. కవి ఏటూరు నాగేంద్రరావును ముఖ్యఅతిథులు సత్కరించి అభినందించారు. తొలుత 'వైద్య వ్యాపారం'పై జరిగిన కవిసమ్మేళనంలో ఎక్కువమంది కవులు ఆసక్తితో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమానికి తొలుత సంస్థ కార్యదర్శి ఈతకోట సుబ్బారావు స్వాగతం పలికారు. కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, కాళహస్తి వెంకటశేషగిరిరావు, దగ్గుమాటి పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీలో విజేతలైన చిరుమన వెంకటరమణయ్య, సుమలత, హరిలకు ఉత్తమ కవితా పురస్కారాలనందించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం నిర్వహించిన ప్రతి కార్యక్రమం విజయవంతం కావడాన్ని సభికులు అభినందించారు.

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# గూడూరు డివిజన్ వార్తలు

# మత్తు వద్దు... సంతోషం నీ సొత్తు!

**- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్**

ప్రజలు మత్తు పదార్థాలను స్వీకరించకుండా సుఖసంతోషాలతో జీవించాలని గూడూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. మద్య పానంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించేందుకు సోమవారం పట్టణంలో సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. తొలుత వాటర్ ట్యాంక్ నుంచి వివేకానందరోడ్డు, ఆసుపత్రిరోడ్డు, గడియారపు స్థంభం కూడలి, ముత్యాలపేట మీదుగా విద్యార్థులు, సిబ్బంది ప్లేకార్డులు చేతబట్టి ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ మాట్లాడుతూ నాటుసారా, కల్తీ కల్లు, మద్యం, గంజాయి, గుడుంబా, ఇతర మాదక ద్రవ్యాలు ప్రాణాలు తీస్తాయని, కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గూడూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మరియు సిబ్బంది

## ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించాలి

**- 1వ పట్టణ ఎస్సై దశరథరామారావు**

ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించకపోతే జరిమానాలు విధిస్తామని గూడూరు 1వ పట్టణ ఎస్సై దశరథరామారావు తెలిపారు. కూరగాయల మార్కెట్ కూడలి, ఆసుపత్రిరోడ్డు ప్రాంతాల్లో ఇటీవల ద్విచక్రవాహనదారులపై దాడులు చేశారు. శిరస్త్రాణం లేని వారికి అపరాధరుసుం విధించారు. మొదటిసారి పట్టుబడిన వారిని హెచ్చరించి పంపారు.



శిరస్త్రాణం లేని వారికి అపరాధ రుసుం విధిస్తున్న 1వ పట్టణ ఎస్సై దశరథరామారావు

## చెన్నైకు సిఆర్ రెడ్డి మందులు



మందులతో మహిళా మండలి సభ్యులు డాక్టర్ సి.రోహిణి తదితరులు

చెన్నైలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా బాధితులకు అంటు వ్యాధులు సోకకుండా ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసుపత్రి సహకారంతో మందులు అందజేయనున్నట్లు అధ్యక్షురాలు విష్ణువందన తెలిపారు. ఇటీవల స్థానిక సిఆర్‌రెడ్డి ఆసుపత్రి నుంచి మందులను చెన్నైకు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల అనంతరం అంటువ్యాధులు సోకకుండా తమ మహిళా మండలి ఆధ్వర్యంలో డాక్టర్ సి.రోహిణి సహకారంతో మందులు అందజేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి లక్ష్మి, జీవని, పద్మ, స్వర్ణ, కె.సీతారెడ్డి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌కు వరద బాధితుల మొర

గూడూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇటీవల వరద బాధితులు అర్జీలను అందజేసేందుకు బారులు తీరారు.

ఇప్పటికే అధికారులు నష్టపరిహారం చెక్కులను అర్హులకు అందజేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలు, పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అధికారులు సర్వే నిర్వహించి తమను అర్హులుగా గుర్తించలేదని, తిరిగి సర్వే నిర్వహించి న్యాయం చేయాలని అర్జీలను అందజేసేందుకు రావడంతో కార్యాలయం ఆవరణం అర్జీదారులతో నిండిపోయింది.



వరద బాధితుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న వెంకటనారాయణమ్మ

## అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

గూడూరు రెండో పట్టణ పరిధిలోని వరద ముంపు ప్రాంతాల్లో ఇటీవల పిఎస్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యాన పేదలకు దాత పొనకా శివకుమార్‌రెడ్డి దాతృత్వంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన దుప్పట్లను పంపిణీ చేశారు. పట్టణంలో లోతట్టు ప్రాంతంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధితులను ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో 2500 దుప్పట్లను అందిస్తున్నట్లు తెలిపారు. వరద బాధితులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేలా ట్రస్టు ఆధ్వర్యాన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనపాటి రవీంద్ర, చెంచు రామయ్య, నర్సింహులు, రత్నం, నర్సరాజు తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మి, మమతల దాతృత్వంతో**

## దుప్పట్లు పంపిణీ



గూడూరు ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో నరసింగరావుపేట, బిసి కాలనీ వరద బాధితులకు ఆదివారం నాడు సుమారు 300 దుప్పట్లను ఎల్లసిరి లక్ష్మి, రేబాల మమత దాతృత్వంతో పంపిణీ చేసినట్లు ఆంధ్ర మహిళామండలి అధ్యక్షురాలు విష్ణువందన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి, జీవని, ప్రభా, పరమేశ్వరి, కె.సీతారెడ్డి, లక్ష్మి పిఎమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో 247కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి గుర్రప్ప

గూడూరు కోర్టు ప్రాంగణంలో 12వ తేదీ నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 247కేసులు రాజీ అయ్యాయని గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి గుర్రప్ప తెలిపారు. కోర్టు ప్రాంగణంలో 12వ తేదీ రాత్రి ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసులకు సంబంధించినవి 155, సెషన్స్ కేసులు 6, వోఎస్ 6, ఏజీ 4, బ్యాంకు కేసులు 13, పీఆర్సీ 3, ఎంసీ 2, డీవీసీ 1, ఎన్‌ఐయాక్టు1, భూ కేసులు 4, తదితర కేసులు పరిష్కరించామన్నారు. పేదలు రాజీ మార్గంలోనే న్యాయం పొందాలని సూచించారు. లోక్‌అదాలత్‌కు సహకరించిన న్యాయవాదులు, పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు జడ్జీలు ఏడుకొండలు, సాయిరాం, ఎస్సైలు దశరథరామారావు, జగన్‌మోహన్‌రావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సమాజంలో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని చిల్లకూరు మండల అన్నంబాక గ్రామ సర్పంచ్ సుమలత అన్నారు. ఇటీవల స్థానిక సునీతా సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నంబాక గ్రామంలో మూడు నెలల పాటు నిర్వహించిన కుట్టు శిబిరం పూర్తి కావడంతో మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు వృత్తి విద్యా శిక్షణను అందజేయడం అభినందనీయమన్నారు. దీంతో మహిళలు స్వయం ఉపాధిని పొందుతూ ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, కార్యదర్శి సారంగం శ్రీలక్ష్మి, జ్యోతి, పోతన తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ సుమలత తదితరులు

## కనుల పండువగా కల్యాణం

మంగళవారం నెల్లూరులోని టిటిడి కల్యాణ మండపంలో టీటీడీ, ధర్మప్రచార మండలి, హిందూ ధార్మిక ప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు వేదికపై కొలువుదీరగా వేదపండితులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చక స్వాములు కల్యాణోత్సవాన్ని మేళతాళాలు వేద మంత్రాల నడుమ వైభవంగా జరిపించారు.



ఈ కల్యాణోత్సవానికి నలుబోలు బలరామయ్య నాయుడు, నలుబోలు రమణారెడ్డి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించగా, ధర్మప్రచార మండలి అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి, హిందూ ధర్మప్రచార పరిషత్ సమన్వయకర్త మల్లెల శ్రీహరి, దేవరాజులు, వి.ధనుంజయ, డాక్టర్ భానుప్రకాష్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు, వీరిశెట్టి సుధాకర్, వేమిరెడ్డి సనత్‌రెడ్డి, కె.గిరిజకుమారి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు మండలం పాలిచర్లవారిపాలెం పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

పనులు నిదానంగా జరుగుతున్నా సానుకూలం కాగలవు. ఆర్థికస్థితి బాగుండి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. కొన్ని అదనపు ఖర్చులు తప్పనిసరి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. బిడ్డలకు శుభకార్య నిర్ణయాలు జరగడం, ఉద్యోగవృద్ధి ఉంటుంది. పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. మీవి కాని విషయాలకు దూరంగా ఉండండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

స్థిరాస్తులు కొనడం, కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలు, వ్యాపార విస్తరణలకు అనుకూల సమయం. అవసరాలకు ఋణాలు లభించి పనులు జరిగిపోతాయి. ఆదాయం సంతృప్తికరం. అనుకున్న పనులను శ్రమపడి సాధించుకుంటారు. మాట స్పీడు, తొందరపాటు వ్యవహారాలు తగ్గించుకొనండి. ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. అవసరాలకు ఋణం చేయక తప్పదు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. అవసరాలు, చెల్లింపులు వాయిదా వేసికొనడం మంచిది. ఉద్యోగులు తమ అధికారుల తోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ప్రైవేటు ఉద్యోగులకు పనిభారం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడవచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థికంగా ఇబ్బంది దినాలివి. వృత్తి వ్యాపారాలు చేసే వారికి సంతృప్తి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. ఏదో ఒక రూపంలో అదనపు ఖర్చులు తప్పవు. మీపై విమర్శలు చేసేవారుంటారు జాగ్రత్త. ఉద్యోగులకు పైవారి వత్తిడి, పని భారం ఎక్కువగా ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సవ్యంగా జరుగుతాయి. అన్ని విషయాలలోనూ టెన్షన్ ఎక్కువగా వుండును.



# బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 18.12.2015 నుండి
తేది. 24.12.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మీన మేష వృషభరాశులలో చంద్రుడు, సింహంలో గురువు, కన్యలో కుజ రాహువులు, 23తేదీ తులలో కుజుడు, తులలో శుక్రుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవి బుధులు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 21 సోమవారము ముక్కోటి ఏకాదశి

**ముహూర్తములు**

- తేది 23 బుధవారము రాత్రి గంట 9.30 నుండి గంట 11.30లోగా సింహ లగ్నమున వివాహ, గృహప్రవేశములు. తేది 24 గురువారము ఉదయం గంట 8.0 నుండి గంట 10.0లోగా మకర లగ్నమున వివాహ వ్యాపారములు. రాత్రి గంట 9.15 నుండి గంట 11.20లోగా సింహలగ్నమున వివాహ, గృహప్రవేశములు.

**కార్తీక మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | సప్తమి | ఉ॥ గం.8.54వ॥ |
| తేది. 19 | శని | అష్టమి | ఉ॥ గం.6.41వ॥ |
| | పిదప | నవమి | రా॥ గం.4.21వ॥ |
| తేది. 20 | ఆది | దశమి | రా॥ గం.1.57వ॥ |
| తేది. 21 | సోమ | ఏకాదశి | రా॥ గం.11.40వ॥ |
| తేది. 22 | మంగళ | ద్వాదశి | రా॥ గం.9.32వ॥ |
| తేది. 23 | బుధ | త్రయోదశి | రా॥ గం.7.36వ॥ |
| తేది. 24 | గురు | చతుర్దశి | సా॥ గం.6.00వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో చిన్నచిన్న సమస్యలుండి సర్దుబాటు కాగలవు. యజమానులు వర్కర్లతో జాగ్రత్తగా మెలగండి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, ఆర్థికావకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. నూతన వస్తువులను సమకూర్చుకొంటారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. పొదుపు పథకాలు చేపట్టుతారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపార పరంగా అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. అయినా అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు తమ వర్కర్లతో జాగ్రత్తగా ఉండండి. కార్యసాధనలో జయం పొందుతారు. కొత్త వస్తువులు సమకూర్చుకొనడం, ప్రముఖులను బంధువర్గాన్ని కలుసుకొనడం, శుభకార్యాలను నిర్ణయం చేయడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి లేక పోయినా సామాన్య ఆదాయ లోపం ఉండదు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. బంధువర్గం వల్ల, బిడ్డల వల్ల సమస్యలు ఎదుర్కొనవలసి రావచ్చు. ఉద్యోగులకు విధి నిర్వహణలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ప్రభుత్వ అనుమతులు ప్రయత్నిస్తే పొందగలరు. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమిస్తారు. వాణిజ్య అగ్రిమెంట్లు, వ్యాపార భాగస్వామ్యాలు, కొత్త లీజులు ఏజన్సీలకు ప్రయత్నించండి. అనుకున్న పనులకు ప్రయత్నాలు కలసి వస్తాయి. ఆదాయ లోపం ఉండదు. స్థిరాస్తుల లావాదేవీలకు సిద్ధపడతారు. కుటుంబంలో స్వల్ప విభేదాలున్నా సర్దుకుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు బాగుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, అభివృద్ధికి అవకాశాలు దొరుకుతాయి. స్థిరాస్తులు, కొత్త వస్తువులు కొనడం జరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ముఖ్యపనులందు బంధుమిత్రుల సహాయ సహకారాలుంటాయి. పనులు విజయ వంతంగా జరుపుకొంటారు. పొదుపు పథకాలు చేపట్టడం, కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకును. కుటుంబసౌఖ్యము బాగుంటుంది. సేవా సాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థిక పరిస్థితి సంతృప్తికరం. వృత్తి వ్యాపారాల వృద్ధికి విశేష కృషి చేస్తారు. మాట తొందరపాటు తగ్గించుకొనండి. నిలబడిపోయిన పనులు కొనసాగుతాయి. బంధు మిత్రుల సహకారం బాగుంటుంది. అనుకోని ప్రయాణాలు, కొత్తవారిని కలుసుకొనడం జరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించవచ్చును. రావలసిన బాకీలు లభించడం, కోర్టు కేసులందు అనుకూలత కలదు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపార రంగాలలో అభివృద్ధి అవకాశాలు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. చేపట్టిన పనులకు ఆటంకాలు వచ్చినా ఏదో ఒక విధంగా జరుపుకొంటారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకొనకుండా ఇతరులతో చర్చించండి. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండండి. బంధువర్గం నుండి శుభవార్తలు వింటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. అందుచే టెన్షన్ పడతారు. వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. శరీరానికి గాయాలు తగుల వచ్చును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం, అధికారుల సహకారం బాగుంటుంది. వస్తు వాహన రిపేర్లుంటాయి. విద్యార్థులు మరింత కష్టపడాలి.

# జపాన్ ప్రధాని నోట నెల్లూరు మాట

శ్రీను గల్పిక

అది న్యూఢిల్లీలోని పాలం విమానాశ్రయం. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు సుష్మాస్వరాజ్, రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్ పారికర్, అరుణ్‌జైట్లీ, యం.వెంకయ్యనాయుడులతో పాటు విదేశాంగ కార్యదర్శులు చేతుల్లో పుష్ప గుచ్ఛాలు పట్టుకుని వున్నారు. అప్పుడే జపాన్‌కు చెందిన ప్రత్యేక విమానం వచ్చి దిగింది. జపాన్ ప్రధాని షింజో అబే అందులో నుండి దిగాడు. షింజో అబేకు పూలబొకేలతో అందరూ ఘనస్వాగతం పలికారు. షింజో అబే వుండి మోడీతో... నేను మీ పార్లమెంటు సమావేశాలను టీవీలో చూస్తున్నాను, సభ్యులు వస్తున్నారు, సభలో అరుచుకుంటున్నారు, వెంటనే బయటకు వెళుతున్నారు. పార్లమెంటు సంప్రదాయాలలో అదో భాగమా, చెబితే మేం కూడా మా పార్లమెంటులో ఆ సాంప్రదాయాన్ని ప్రవేశపెడతామన్నారు. అందుకు మోడీ... మీకు అది సాధ్యం కాదులేండి... ఎందుకంటే అక్కడ ఇంది రమ్మ కుటుంబం లేదు కదా, వ్యక్తిగత కేసు కోసం 125కోట్ల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటును స్థంభింప చేసే సంప్రదాయం మా దేశంలో మాత్రమే వుంది. అది మాకే చెల్లుబాటవుతుందని చెప్పాడు. తర్వాత కార్లెక్కి అందరూ ప్రధానమంత్రి నివాసానికి చేరుకున్నారు. అల్పాహార విందు అనంతరం ఇరు ప్రధానులు మోడీ - షింజో అబేలు చర్చలకు దిగారు. ఈరోజు వారణాసిలో గంగా హారతి వుంది, ఎందుకంటే స్మార్ట్ సిటీగా మీరు దత్తత తీసుకున్న నగరమది అని చెప్పారు. దానికి షింజో అబే స్పందిస్తూ... తప్పకుండా వస్తాను, అలాగే నెల్లూరులో పెన్నా హారతి లేదా, ఆ నగరాన్ని కూడా మేం దత్తత తీసుకోవాలనుకుంటున్నాం అని చెప్పాడు. ఆ పేరు వినగానే అక్కడే వున్న వెంకయ్య... బాబ్బాబు ఆ పని చేసి పుణ్యం కట్టుకోండని అడిగాడు. మోడీ బదులిస్తూ నెల్లూరులో పెన్నాహారతి సంగతి తర్వాత పరిశీలిద్దామని చెప్పాడు. తర్వాత ఇరు దేశాల మధ్య ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి. మోడీ భారత దేశానికి జపాన్ నుండి ఏమేం కావాలో అడగసాగాడు. మాకు ముంబై నుండి అహ్మదాబాద్‌కు బుల్లెట్ రైలు కావాలని మోడీ అడిగాడు. షింజో అందుకు... తప్పకుండా ఇస్తాం, అట్లాగే ఢిల్లీ నుండి నెల్లూరుకు కూడా ఒక బుల్లెట్ ట్రైన్ వేయండని అడిగాడు. దానిని కూడా పరిశీలిస్తామంటూ మోడీ... గుజరాత్‌లో ఒక అణువిద్యుత్ కేంద్రం పెట్టండని కోరాడు. షింజో అబే బదులిస్తూ... అలాగే చేస్తాం, అలాగే నెల్లూరులోనూ ఒక అణువిద్యుత్ కేంద్రం మా డబ్బులతోనే పెడతామన్నాడు. ఆ మాట విన్న వెంకయ్యనాయుడు... వీడి నెల్లూరు అభిమానం తగలెయ్యా, నాకంటే ఇతను నెల్లూరు మీద ఎక్కువ ప్రేమ చూపిస్తున్నాడేంటబ్బా అని ఆలోచనలో పడ్డాడు. తర్వాత సుష్మాస్వరాజ్ వుండి... టోక్యో నుండి నేరుగా వారణాసికి డైలీ ఒక ఫ్లైట్‌ను నడపదామని ప్రతిపాదించింది. షింజో అబే అందుకు... దానికి ఓకే, అట్లాగే టోక్యో నుండి నెల్లూరుకు కూడా ఒక ఫ్లైట్‌ను నడపదామని చెప్పాడు. వెంకయ్యనాయుడు జోక్యం చేసుకుని... సార్, నెల్లూరులో ఇంకా ఎయిర్‌పోర్ట్ కట్టలేదు అని చెప్పాడు. అట్లాగయితే వెంటనే నెల్లూరులో ఇంటర్నేషనల్ క్లాసు ఎయిర్‌పోర్టును మేమే కట్టిస్తామని షింజో అబే అన్నాడు. మేం మేకిన్ ఇండియా కార్యక్రమాన్ని పెట్టుకున్నాం. సాంసంగ్ టీవీ తయారీల పరిశ్రమను నోయిడాలో పెట్టండని అరుణ్‌జైట్లీ అడిగాడు. అలాగే సాంసంగ్ పరిశ్రమను నోయిడాలో పెడతాం, అలాగే నెల్లూరులోనూ ఇంకో పరిశ్రమను పెడతామన్నాడు. మా దేశ అభివృద్ధిలో మీ సహకారం ఎంతైనా అవసరం, ఓ లక్ష కోట్లు అప్పుగా ఇవ్వగలరా అని మోడీ అడిగాడు. లక్షణంగా లక్షకోట్లు ఇస్తాం, అదే సమయంలో నెల్లూరుకు కూడా లక్ష కోట్లు ఫ్రీగా ఇస్తామని షింజో అబే చెప్పాడు. ఆ మాటకు అక్కడున్న వాళ్లందరికీ తల తిరిగినంత పనయ్యింది. ప్రతి పాయింట్‌లోనూ ఇతను నెల్లూరు, నెల్లూరు అని కలవరిస్తున్నాడు. అడిగిన ప్రతిదానిని నెల్లూరులో పెడతామంటున్నాడు, ఇందులో ఏదో మతలబు ఉందని అందరూ మనసులో అనుమానపడసాగారు. వెంకయ్యనాయుడు మాత్రం మనసు మీద అదుపు తప్పి... గంట నుండి చూస్తున్నాను, నెల్లూరులో పుట్టి పెరిగిన నేనే నెల్లూరు గురించి ఇంతగా ఆలోచించడం లేదు, నువ్వెందుకు పదేపదే నెల్లూరును కలవరిస్తున్నావని అడిగాడు. అప్పుడు షింజోఅబే అసలు విషయం బయటపెట్టాడు. మా దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. మా దేశంలో అన్నీ ఉన్నాయి. కాని మీ దేశంలో వున్నవి మా దేశంలో ఒక్కటి మాత్రం లేదన్నాడు. ఏంటవి అని సుష్మాస్వరాజ్ అడిగింది. హైబ్రీడ్ బ్రాండ్ 20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురు దోమలు... వీటి కోసమే మీరు అడిగిన వాటికన్నింటికీ నేను ఒప్పుకున్నాను. రెండో ప్రపంచ యుద్ధకాలంలోనే ఇవి మా వద్ద వుండుంటే హిరోషిమా, నాగసాకీ పట్టణాలు అణుదాడికి గురయ్యుండేవి కావు. ఎందుకంటే ఈ దోమలతో జీవాను బాంబులను తయారుచేసి అమెరికా, ఇంగ్లాండ్‌లపై వేసుండేవాళ్లం. ఆ దెబ్బకు రెండు దేశాలు ఇప్పటికీ కోలుకోకుండా వుండేవి. కనీసం ఈరోజైనా మేం వాటిని దగ్గరపెట్టుకుంటే శత్రుదేశాల ముప్పు నుండి బయటపడగలం, మీకు ఎన్ని అణుబాంబులు కావాలన్నా ఇస్తాం, మాకు మాత్రం ఓ టన్ను ముదురుదోమలు ఇవ్వండి చాలు అని జపాన్ సాంప్రదాయ రీతిలో నడుం వంచి రెండు చేతులు జోడించి ప్రార్థించాడు. ఆయన విన్నపానికి కరిగిపోయిన మోడీ... వెంటనే నెల్లూరు నగరపాలక సంస్థ వారితో మీటింగ్ ఏర్పాటు చేయమని వెంకయ్యనాయుడుకు చెప్పాడు.

★★★★★

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రధాని మోడీ, జపాన్ ప్రధాని షింజో అబే, కేంద్ర మంత్రి వెంకయ్య, ఇతర కేంద్రమంత్రులతో పాటు నైట్‌రైడర్, ముదురుదోమల మంత్రి నారాయణ, మేయర్ అజీజ్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+), భానుశ్రీ, పులిమి శైలజ, కార్పొరేటర్లు వున్నారు. వీళ్లంతా కూడా దిగాలుగా ముఖాలు వేలాడేసుకుని వున్నారు. మోడీ వీరిని చూసి... జపాన్ ప్రధాని మీకు లక్షకోట్ల విలువైన బహుమతి తెస్తే మీరేం అలా వున్నారని అడిగాడు. మేం ఇక్కడ అంతకంటే విలువైంది కోల్పోయామని వివేకా చెప్పాడు. అంతకంటే విలువైందా... ఏంటది అని మోడీ అడిగాడు. వివేకాలో దుఖం పొంగుకొస్తూ... మేం ఎంతో మురిపెంగా పెంచుకున్న ముదురుదోమలు సార్, మొన్న వరదలకు అన్నీ కొట్టుకుపోయాయి. బుజ్జి ముండలు.. పసిబిడ్డల్లా సాకాం, ఒక్క వానకు పోయాయి. అంతకంటే విలువైన సంపద ఏముంటుందని అన్నాడు. మోడీ నోరెళ్ల బెట్టి... దోమలు వెళ్లిపోయాయా? జపాన్ ప్రధాని వచ్చిందే వాటి కోసం. ఒక టన్ను దోమలిస్తే ఆయన మనకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తారు, ఇప్పుడెలా, ఈ ముదురుదోమలను మళ్లీ అభివృద్ధి చేయలేమా... అని అడిగాడు. అప్పుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జోక్యం చేసుకుని... ఎందుకు చేయలేం సార్, ఓ నెల పారిశుద్ధ్య కార్మికులకు సెలవులివ్వండి, చెత్తను ఎత్తొద్దు, మురికి కాలువల్లో పూడిక తీయొద్దు... ఓ నెల తర్వాత చూడండి, ఆ ముదురుదోమలు రాకుండా ఎక్కడకు పోతాయి. మనసుంటే మార్గముంటుందన్నాడు. కోటంరెడ్డి ఐడియాకు ప్రధానులిద్దరితో పాటు మిగతా వాళ్లు కూడా చప్పట్లు కొట్టారు.



## కావలి కబుర్లు

### హెల్మెట్ ధరించండి...

# ప్రాణాలు కాపాడుకోండి

**- డీఎస్పీ రాఘవరావు**



వాహన చోదకులంతా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని కావలి డిఎస్పీ రాఘవరావు ప్రజలకు సూచించారు. సోమవారం హెల్మెట్ ధారణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రూరల్ సిఐ ఎం.మధు బాబు, 2వ పట్టణం ఎస్ఐ అన్వర్‌బాషాల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి డిఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకునికి హెల్మెట్ తప్పనిసరి అని దాని ఆవశ్యకతను వివరించారు. ప్రజలకు అవగాహన కలిగించేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని అన్నారు. ముందుగా పోలీసుశాఖతోనే హెల్మెట్ ధారణ ప్రారంభించామన్నారు. ప్రజలు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన వారికి ముందుగా అపరాధ రుసుము, మరలా తప్పు చేస్తే జైలుకు కూడా పంపవచ్చునన్నారు. ఈ ర్యాలీ ముసునూరు నుండి జెండాచెట్టు వరకు, తిరిగి డిఎస్పీ కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామమూర్తి, రఘునాథ్, పుల్లారావు, వెంకటరమణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెనడీ, కార్యదర్శి సురేంద్ర రెడ్డి, జగన్మోహన్, రెడ్ క్రాస్ సభ్యులు జి.ప్రస న్నాంజనేయులు, డి.రవి ప్రకాష్, తెలుగు యువత పట్టణాధ్యక్షులు అశోక్, బ్రహ్మానందం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



# బడుగు బలహీనవర్గాల పార్టీ టిడిపి

**- జడ్పీటీసీ దామా మహేశ్వరరావు**



బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని, దానిని నేటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని కొండాపురం జడ్పీటీసీ సభ్యులు దామా మహేశ్వరరావు అన్నారు. సోమవారం జనచైతన్యయాత్ర ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మండలంలోని వివిధ పంచాయితీల్లో జనచైతన్యయాత్రను చేపట్టారు. అనంతరం మండల ఉపా ధ్యక్షులు సోలినేని చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముగింపుసభలో కావలి ఏఎంసి వైస్‌ఛైర్మెన్ గంటా నరశింహం, టిడిపి సీనియర్ నాయకులు పి.చినమాల కొండయ్య, టిడిపి మండలాధ్యక్షులు చెరు కూరి వెంకటాద్రినాయుడు, బీమారంపాడు సర్పంచ్ చాగంటి కృష్ణ, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఆర్.కృష్ణయ్య, మండల పర్యవేక్ష కులు బొట్లగుంట హరిబాబునాయుడులు పాల్గొని ఉపన్యసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నాయకులందరూ కలసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఉదయగిరి శాసనసభ్యులు బొల్లినేని వెంకటరామారావు పదునైన నాయకులని, ఆయన అండతో పార్టీని బలో పేతం చేయాలని అన్నారు. కొండాపురం మండలం ఎప్పుడూ టీడీపీకి కంచుకోటని అన్నారు. మండలంలో పార్టీ పటిష్టతకు సోలినేని, గంటా కుటుంబాలు ఎనలేని కృషి చేశాయని అన్నారు. పార్టీ కోసం అంతగా కృషి చేసిన సోలినేని పెద మాలకొండయ్య విగ్రహం మండలంలో ఎంతో అవసరమన్నారు.

ఈ కార్యక్రమంలో మాచర్ల, రమేష్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు అమరజీవి




ఆంధ్రరాష్ట్ర అవతరణకై ఆమరణ నిరాహారదీక్షతో ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు రాష్ట్రాల వారందరికీ చిరస్మరణీయుడని రెడ్‌క్రాస్ ఉపా ధ్యక్షులు గంధం ప్రసన్నాంజనేయులు తెలిపారు.

మంగళవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో జరిగిన పొట్టి శ్రీరాములు 63వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ మరో ఉపా ధ్యక్షులు తన్నీరు మాల్యాద్రి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, చెదరని పట్టుదలలే ఆయుధాలుగా అమరజీవి తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని తెలిపారు. ఈ సభలో పాల్గొన్న డిబిఎస్ సంస్థల కరస్పాండెంట్, నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పొట్టి శ్రీరాములు దీక్ష, అచంచలమైన సంకల్పబలం అందరికీ ఆదర్శం కావాలని అన్నారు.

ఈ సభలో ఇంకా డిబిఎస్ సంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్‌బాబు, కౌన్సిలర్ కె.రాజశేఖర్, స్థానిక వ్యాపారవేత్త అనుమాలశెట్టి శివకుమార్, న్యాయవాది సాయి ప్రసాద్, లైన్స్ బ్లడ్‌వరల్డ్‌కు చెందిన బి.లక్ష్మీనంద, సి.సుధాకర్‌బాబు, రెడ్‌క్రాస్ ఉద్యోగులు పాల్గొని అమరజీవికి నివాళులర్పించారు.

# ఆక్రమణల తొలగింపుపై సందేహాలెన్నో!

ఇటీవల సంభవించిన వరదల నేపథ్యంలో నెల్లూరులోని పంట కాలువల ఆక్రమణలపై అధికారయంత్రాంగం దృష్టి సారించడం తెలిసిందే! అయితే పంట కాలువల ఆక్రమణల వెనుక తప్పు ఆక్రమణదారులదే కాదు, వారికి పట్టా లిప్పించిన నాయకులది, ఇచ్చిన అధికారు లది కూడా! గత 20ఏళ్ల కాలాన్ని పరిగణలోకి తీసుకుంటే నెల్లూరు నగరంలో డబ్బులు పెట్టి కొని రిజిస్ట్రేషన్ చేయించు కున్న స్థలాలలో ఎన్ని ఇళ్లులు కట్టారో, పంట కాలువలను ఆక్రమించి అంతకంటే ఎక్కువ ఇళ్లనే కట్టారు. 150ఎకరాల విస్తీర్ణంలో వున్న మాగుంట లేఅవుట్‌లో కంటే అందులో సగం విస్తీర్ణం కూడా లేని సర్వేపల్లి కాలువకట్ట మీద ఇంతకంటే నాలుగింతల ఇళ్లుంటాయి. మూలా పేటలో ఎన్ని ఇళ్లుంటాయో, మూలాపేట చెరువుకట్ట క్రింద అన్ని ఇళ్లుంటాయి. ఇలా పంట కాలువలు, చెరువు పోరంబోకు స్థలాల్లో కాలనీలకు కాలనీలే ఏర్పడ్డాయి. ఈ కాలనీలలో వేలాది ఓట్లున్నాయి. ఆ ఓట్లు ఇప్పుడు శక్తివంతంగా మారాయి. ఆ ఓట్లుండబట్టే గత కొన్నేళ్లుగా ఏ ప్రభుత్వం కూడా ఈ ఆక్రమణల జోలికి పోలేకపోయింది.

అదీగాక ఆక్రమణదారులకు చంద్ర బాబునగర్, వై.యస్.నగర్ వంటి ప్రాం తాల్లో స్థలాలిచ్చారు. అక్కడ రోడ్లుండవు, మంచినీళ్లుండవు, లైట్లుండవు. ఇప్పటి కిప్పుడు ఇళ్లులు కట్టుకుని నివసించే పరిస్థితి ఆ ప్రాంతాలలో వుండకపోతుండడంతో ఆక్రమణదారులు తాముంటున్న ప్రాంతా లను వదిలిపోవడం లేదు.



నారాయణ మెడికల్ కాలేజీ వద్ద పంట కాలువ ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్

మొన్నటివరకు వరదల నేపథ్యంలో పంట కాలువల ఆక్రమణలను తీసేయ డానికి ప్రభుత్వం గట్టిగానే వుంది. అయితే ఇది అమలు జరిగితే పెద్దఎత్తున ఆస్తినష్టమే కాక, వందలకోట్లలో నష్టపరిహారం కూడా ఇవ్వాల్సి వుంటుంది. కొన్ని వేల కుటుం బాలు రోడ్డున పడతాయి. పంటకాలువల ఆక్రమణలు తొలగించడం మొదలుపెడితే దాదాపు 20శాతం నగరం ఖాళీ అవు తుంది. ఇది భగీరథ యజ్ఞమే. ప్రశాం తంగా ఈ పని జరిగితే ఫర్వాలేదు. కాని అవాంతరాలు ఎదురైతే అటు ఇటు కాకుండా పోతేనే ఇబ్బంది. మొన్న వర్షాలలో వరదలకు కారణం స్వర్ణాలచెరువు అలుగు నీళ్లు పంటకాలువలు పూడిపోయి రోడ్ల మీదకు రావడమే. ఈ కాలువలలో పూర్తి స్థాయిలో పూడికలు తీయడంతో పాటు, స్వర్ణాల చెరువు నుండి పెన్నానదికి వరద నీటిని మళ్లించే విధంగా ఓ కాలువను తవ్వాలని స్థానిక ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రతిపాదన కూడా ఒక పరిష్కారమార్గమే!

# ఘంటసాల గానం ఓ ఆహ్లాద వరం



దైనందిన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులకు లోనయ్యే వారికి ఘంటసాల గానం ఓ ఆహ్లాదవీచికని, ఆయన గానమాధుర్యాన్ని నేటి తరం గాయకులు విశ్వవ్యాప్తం చేయాలని నెల్లూరుజిల్లా ఎస్పీ గజరావు భూపాల్ కళాకారులకు పిలుపునిచ్చారు. నెల్లూరు టౌన్‌హాల్లో ఆదివారం ఘంటసాల 93వ జయంతిని పురస్కరించుకుని ఘంటసాల ఆర్ట్స్ అండ్ మ్యూజికల్ అకాడమీ(గామా) ఆధ్వర్యంలో నీలకంఠం శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎంతో మాధుర్యంగా గీతాలను ఆలపించిన ఆయన గానాన్ని సుసంపన్నం చేయాల్సిన బాధ్యత కళాకారులపై ఉందన్నారు. తాను పోలీస్ అకాడమీలో ఎస్పీగా శిక్షణపొందే సమయంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మిత్రులు తమ ప్రాంతానికి చెందినవారి గీతాలను ఆలపిస్తూ ఎంతో గొప్పగా చెప్పేవారన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నగర డిఎస్పీ వెంకటరాముడు, సీనియర్ గాయకులు, ప్రజాప్రతినిధులు, కావలి మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు దేవరాల సుబ్ర హ్మణ్యంయాదవ్, అభినవ ఘంటసాల పాటూరు శ్రీనివాసులు, కళాకారులు పాల్గొన్నారు.

# వాల్‌పోస్టర్లు అంటిస్తే చర్యలు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల గోడలు, డివైడర్లు, ట్రాఫిక్ ఐల్యాండ్‌లపై ప్రచార, సినిమా పోస్టర్లను అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ మూర్తి హెచ్చరించారు. కార్పొరేషన్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతా రని తెలిపారు. పోస్టర్లను అంటించేందుకు కార్పొరేషన్ అనుమతులు పొందాలన్నారు.

### అధిక వడ్డీలు వసూలు చేస్తే..

# క్రిమినల్ కేసులు

**- గూడూరు డిఎస్పీ శ్రీనివాస్**



ప్రభుత్వానికి విరుద్ధంగా ప్రజల నుంచి అధికవడ్డీలు వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేస్తే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కొందరు నిరక్షరాస్యులను అధికవడ్డీలకు నగదు మార్చుకుంటూ దోచుకుంటున్నారని సమాచారం అందుతోందని, అటువంటివారిపై ప్రత్యేకనిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తండల్ వ్యాపారులు బాధితులను మానసికంగా, శారీరకంగా వేధించినా, అధిక వడ్డీలు వసూలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పట్టణంలో ఇప్పటికే కొందరిపై నిఘా ఉంచామని, బాధితుల నుంచి నగదు వసూలు చేసే సమయంలో బెదిరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కాల్‌మనీ, తండల్, ఇతర చట్టబద్ధతలేని వాటిని నిర్వహిస్తే ఉపేక్షించమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ సిఐలు సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, ఎస్సైలు దశరథరామారావు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డిదారిన అర్హత లేని కళాబృందాలు

ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాలను దొడ్డిదారిన అర్హత లేని కళాబృందాలకు కేటాయిస్తున్నారని, పౌరసంబంధాల శాఖ విభాగంలోని ఏవీఎస్(ఆడియో, వీడియో సూపర్‌వైజర్) అధికారి అక్రమాలకు పాల్పడుతున్నారని టిడిపి జిల్లా సాంస్కృతిక విభాగం కళాకారులు ఆరోపిస్తున్నారు. ఆ అధికారిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మెల్సీ బీద రవిచంద్రను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఏవియస్‌గా చెలామణి అవుతున్న ఆ అధికారి అర్హతలేని వారికి ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాలను అప్పగిస్తూ వారి వద్ద నుంచి మామూళ్లు దండుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన బీద రవిచంద్ర రాష్ట్రమంత్రి ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపించి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పెంచలబాబు, వసంతకుమారి, మల్లిఖార్జున, శ్రీరాములు, కేతా సుబ్బారావు, వెంకట రమణయ్య, కెఎస్‌బాబు, వహీదా, మేకప్ సుధాకర్, భవానీబాయి పాల్గొన్నారు.

# 'వైకుంఠ' దర్శనానికి పకడ్బందీగా ఏర్పాట్లు

ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన భక్తులందరికీ శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దర్శనభాగ్యం కలిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగనాథస్వామి దేవస్థానం ప్రాంగణంలో ముక్కోటి ఏర్పాట్లపై అధికారులతో సమన్వయకమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యూలైన్లు, బారికేడ్లు, తాగునీరు, ప్రసాదాలు భక్తులకు అందించాలని కోరారు. తెల్లవారుజాము నుండే పెన్నానదిలో స్నానాలు చేసేందుకు భక్తులు వస్తారని, వారి రక్షణ కోసం పోలీసు బందోబస్తు, నిరంతరం విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ధర్మ దర్శనం కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆర్డీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత యేడాది ఏర్పాట్లలో జరిగిన లోపాలను సరిచేసుకుని అన్ని శాఖల సమన్వయంతో ముక్కోటి ఏకాదశి పండుగను విజయవంతం చేయాలన్నారు. నెల్లూరు నగర డిఎస్పీ వెంకటరాముడు మాట్లాడుతూ 400మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాదాయ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆర్టీఓ పూర్ణచంద్రరావు, విద్యుత్‌శాఖ డిఇ సంజయ్‌కుమార్, డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణోత్సవ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

పిఎస్ఎల్‌వి-సి29 వాహకనౌక నిప్పులు చిమ్ముకుంటూ నింగిని చీల్చుకుంటూ దూసుకెళ్లింది. మొత్తం 21.2నిముషాలలో, నాలుగుదశలలో ప్రయోగం పూర్తయ్యింది. ఇస్రోకు ఇది 50వ ప్రయోగం కావడం, సింగపూర్ దేశం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తయారు చేసిన ఉపగ్రహాలను మనకు అప్పగించడంతో ఈ ప్రయోగానికి ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. ప్రయోగం విజయవంతమైన వెంటనే ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు సింగపూర్ శాస్త్రవేత్తల ఆనందానికి ఆకాశమే హద్దయ్యింది. 'ఇస్రో' ఇటీవల అంతరిక్ష వాణిజ్య ప్రయోగాలలో శరవేగంగా దూసుకుపోతోంది. ఇప్పుడు సింగపూర్ ఉపగ్రహాల సెక్సెస్‌తో ప్రపంచ దేశాలకు 'ఇస్రో'పై ఇంకా నమ్మకం కుదురుతోంది. భవిష్యత్‌లో అంతరిక్ష వాణిజ్యం పెరగడానికి ఈ ప్రయోగాలు దోహద పడనున్నాయి. భారత కీర్తిపతాకను ప్రతి ప్రయోగంలోనూ రెపరెపలాడిస్తున్న 'ఇస్రో' టీంకు 'లాయర్' అభినందనలు.

# స్వరానికి స్వర్ణోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అన్నా, ముద్దుగా బాలూ అన్నా తెలియని వారుండరు. బాలూ పాట వినని వారు అసలే వుండరు. ఆయనే ఒక పాటల పూదోట. ఆ పాటల్లోని మాధుర్యం అత్యంత మధురం. ఎంతగా విన్నా ఇంకా ఇంకా వినాలనిపించే పాటేదైనా వుందంటే అది బాలూగారి పాటేననవచ్చు. ఈ తరంతో ఆయన స్వరం అంతగా అమరిపోయింది. ఆయన పాట తెలుగువారి గుండెలకు హత్తుకుపోయింది. ఇప్పుడే కాదు, చిన్నతనం నుంచి ఆయనకు పాటలంటే ఎంతో ఇష్టం. ఆయన శ్వాస..ధ్యాస అంతా పాటలపైనే. అవే ఆయన్ను నెల్లూరు నుంచి మద్రాసుకు నడిపించాయి. బాలూ పాటలు విన్న ప్రముఖ సంగీతదర్శకుడు కోదండపాణి బాలూకు అప్పట్లో ఎంతో చేయూతనందించారు. బాలూ పాటంటే ఇష్టంతో.. బాలూకు చిత్రసీమలో పలు అవకాశాలు కల్పించారు. మేడంటే మేడా కాదు..గూడంటే గూడూ కాదు..పదిలంగా అల్లుకున్న పొదరిల్లు మాది".. అంటూ సుఖ దు:ఖాలు చిత్రంలోని పాట పాడించింది కూడా కోదండపాణి గారే. ఈ పాట ఆబాలగోపాలాన్నీ అలరించింది. అలా బాలూ పాటలు సూపర్‌హిట్ కావడం మొదలెట్టడంతో సినీసంగీత రంగంలో బాలూ ఇక వెనక్కి తిరిగి చూడలేదు. నాటినుంచీ తెలుగు సినీ సంగీతరంగాన్ని ఓ కమ్మని గానమాధుర్యం కమ్మేసినట్లయింది. ఆ గంధర్వగానం సినీజగత్తుతో పాటు, అశేష జనసందోహాన్ని నేటికీ ఉర్రూతలూగిస్తోంది. ప్రత్యేకించి తెలుగు ప్రజలంతా ఆ పాటల తేనెల ఊటల్ని ఆస్వాదిస్తూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

### పాడిన పాటల్లా హిట్టే :

సినీరంగంలో ప్రవేశించినప్పటినుంచి నేటిదాకా ఆయన ఎన్నో వేల పాటలు పాడారు. పాడిన పాటల్లా 'హిట్' అనిపించారు. ఏ రాగంలో పాడినా అద్భుతమనిపించారు. సకలజనరంజకంగా వుండే ఆయన పాటలు ఎన్నిసార్లు విన్నా.. ఇంకా ఇంకా వినాలనే అనిపిస్తుంటుంది. కొన్ని పాటలైతే, తప్పకుండా ఇది బాలూగారు పాడాల్సిన పాటేననే ముద్ర వేసుకున్నారు. శ్రోతలను గిలిగింతలు పెట్టే ఎన్నో పాటలతో పాటు, అద్భుతమనిపించే శంకరాభరణం వంటి గీతాలు, కన్నీరొలికించే విషాద గీతికలు, ఆర్ద్రతతో గూడిన భక్తిపాటలు..ఎన్నో వేలాది పాటలు ఆయనకు ఎనలేని ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. చెల్లెలి కాపురం చిత్రంలో "చరణకింకిణులు ఘల్లు ఘల్లుమన..కరకంకణములు గలగలలాడగ, వినీల కచభర విలాస బంధుర తనూలతిక చంచలించిపోగా".. వంటి పాటలు, పాడితే బాలూగారే పాడాలి అన్నట్లుగా వుండి అందరి ప్రశంసలూ అందుకున్నాయి. పదాల ఉచ్ఛారణలో స్పష్టత, స్వరంలో శృతిపక్వత ఆయన సొంతం. అందుకే ఆయన ప్రజల హృదయాల్లో గాన గంధర్వుడుగా తనదంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్నారు.

### ఎన్నెన్నో రికార్డులు..అవార్డులు :

ఆయన గాత్రమాధుర్యానికి అద్భుతమైన గుర్తింపురావడంతో సినీసంగీత వనంలో ఆయనో పాటల కోయిలయ్యారు. రోజుకొక పాట అని కాక, ఎన్ని పాటలు పాడాల్సివచ్చినా కాదనకుండా.. అలుపెరుగకుండా, గాత్రమాధుర్యం ఎక్కడా మొక్కవోకుండా పాడారు. నేటికీ అవిశ్రాంతంగా పాడుతూనే వున్నారు. ఆయన బాగా బిజీగా వున్న రోజుల్లో ఒకే రోజు 19 పాటలు పాడిన రోజులు కూడా వున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక రోజులో 19 తమిళపాటలూ 16 హిందీ పాటలు కూడా పాడిన ప్రఖ్యాతి ఆయనదే. ఒక్క తెలుగులోనే కాక తమిళం, హిందీ, కన్నడ భాషల్లోనూ ఆయన తన అసామాన్యమైన ప్రతిభతో రాణిస్తు తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటుతున్నారు. సినీరంగంలో ఆయన ఇప్పటికి 50వేల పాటలకు పైగానే పాడారంటే.. ఆయన గానమాధుర్యం అలాంటిది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ గంధర్వ గానం ఆయనకు భగవంతుడిచ్చిన ఆశీర్వాదం. ఆ స్వరం.. ఆయనకో వరం. ఆ స్వరమే ఆయనకు ఎన్నో రికార్డులను సాధించి పెట్టింది. ఎన్నో అవార్డులను సాధించి పెట్టింది. ఆయనకెంతో పేరుతెచ్చిన శంకరాభరణం, సాగరసంగమం, రుద్రవీణ చిత్రాలకు జాతీయస్థాయి అవార్డులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాల నుంచి ఎన్నో అవార్డులు అందుకున్నారాయన. ఆయనను వరించిన పురస్కారాలకు ఇక లెక్కే లేదు. 1981లో బెంగుళూరులో ఉపేంద్రకుమార్ దర్శకత్వంలో కన్నడంలో ఏకంగా ఒకే రోజు 16 పాటలు పాడి రికార్డును నెలకొల్పిన అసామాన్య గాయకుడు బాలూ. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల దాకా ఏకధాటిగా 16 పాటలు పాడి ఆయన అందరి కరతాళధ్వనులందుకున్నారు.

### తెలుగు పాటకు పట్టాభిషేకం :

మంచి మాటకీ, మంచితనానికీ ఆయనో చిరునామాగా వున్నారు. నేటికీ జాతీయస్థాయిలోనే కాక, అంతర్జాతీయస్థాయిలోనూ తెలుగుపాటకు పట్టం కట్టి పట్టాభిషేకం చేస్తూనే వున్న ఏకైక గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారే. తనతో పాటు, ఎందరో వర్ధమాన సంగీతకారులచే బాలూ స్వయంగా స్వరాభిషేకం చేయిస్తూనే వున్నారు. అంతేకాదు, ఆయనో మూర్తీభవించిన మానవతా గీతిక..అందుకు ఆయన ప్రతి మాటా ఒక ప్రతీక. ఆణిముత్యాల్లాంటి మంచిమాటలతో ప్రజలందరినీ మంచివైపు మానవత్వం వైపు నడిపిస్తున్న మనసున్న మనిషి ఆయన. బాలూ లాంటి బంగారుగాయకుడు తెలుగుజాతికే గర్వకారణం. ఈ డిసెంబర్ 15తో ఆయన పాటల ప్రస్థానం.. 50వ వసంతానికి చేరుకోవడం ఎంతైనా సంతోషదాయకం. ఆయన పాటల ప్రస్థానంలో ఇది మరచిపోలేని 'స్వర్ణో'త్సవం. ఒక్కమాటలో చెప్పాలంటే, మధురగానం.. మంచి గుణం కలిస్తే.. అదే బాలూ. బాలూగారి స్వర స్వర్ణోత్సవం సందర్భంగా, ఆ స్వర్ణోత్సవ స్వరాన్ని వీనులవిందుగా వింటూ.. ఆ గానగంధర్వునికి 'లాయర్' హృదయపూర్వక శుభాభినందనలు చెప్తోంది. అంతేకాదు, తెలుగుపాటను ఒక బావుటాగా చేపట్టి తెలుగుపాట ఖ్యాతిని, తెలుగుజాతి విఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్న బాలూకు, తద్వారా ప్రత్యేకించి సింహపురిసీమ కీర్తిని జగద్విదితం చేస్తున్న ఆ గాన గంధర్వునికి సింహపురి ప్రజలందరి తరఫునా..'లాయర్' మరోసారి ప్రత్యేక కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు చెప్తోంది.

# 'చంద్ర'బంధం

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశ స్వతంత్ర రాజకీయ చరిత్రలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న సందర్భాలు చాలాతక్కువ. ఒకవేళ చేసుకున్నా అవి రాజకీయ వివాదాల పరంగా ఉండేవేకాని తీవ్రంగా ఉండేవి కావు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఇద్దరు సీఎంలు ఒకర్నొకరు దూషించుకున్న సంఘటన చంద్రబాబు, కేసీఆర్‌ల విషయంలోనే చోటుచేసుకుంది. ఇక్కడ పరస్పరం దూషించుకున్నారని చెప్పడంకంటే కూడా చంద్రబాబును కేసీఆర్ తీవ్రంగా తిట్టిపోసాడని చెప్పొచ్చు.

తెలంగాణలో జరిగిన ఓటు-నోటు వ్యవహారం కేసీఆర్ - చంద్రబాబుల మధ్య పెను దుమారం రేపడం తెలిసిందే! ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్ కొనుగోలు వ్యవహారంలో స్వయంగా చంద్రబాబు తల దూర్చడం, స్టింగ్ ఆపరేషన్‌లో అడ్డంగా దొరికిపోవడం జరిగింది. చంద్రబాబును హైదరాబాద్‌లో ఉండకుండా తరిమేయాలనుకున్న కేసీఆర్‌కు ఈ ఓటు-నోటు కేసు మంచి ఆయుధంలా దొరికింది. రాష్ట్ర విభజన తర్వాత కూడా చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌పై కంటే తెలంగాణ రాజకీయాల మీదే ఎక్కువ దృష్టి పెట్టాడు. ఏపి రాజధాని కూడా హైదరాబాద్‌లోనే వుంది. తెలంగాణలో పార్టీని పటిష్టంగా నిలబెట్టుకోవాలనుకున్నాడు. చంద్రబాబు హైదరాబాద్‌లోనే వుంటే భవిష్యత్‌లో కేసీఆర్‌కే ఇబ్బంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో చంద్రబాబు ప్రభావం చూపించగలడు. చంద్రబాబును హైదరాబాద్ నుండి ఎలా తరిమేయాలా అని ఆలోచిస్తున్న కేసీఆర్‌కు వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు 'ఓటు-నోటు' కేసు చిక్కింది. ఈ కేసును చేతిలో పెట్టుకుని చంద్రబాబును భయపెట్టాడు. ఓ దశలో హైదరాబాద్‌కు పోతే చంద్రబాబును అరెస్ట్ చేయడం ఖాయమనే వాతావరణం కల్పించాడు. ఈ భయంతోనే చంద్రబాబు కొన్ని రోజుల పాటు హైదరాబాద్‌కు పోలేదు.

ఈ సమయంలో కేంద్రమంత్రి ఒకరు జోక్యం చేసుకుని చంద్రబాబు, కేసీఆర్‌ల మధ్య రాజీ కుదిర్చి, కేసును నీరుగారేటట్లు చేసారని అప్పుడే వార్తలొచ్చాయి. ఇక ఆ తర్వాత నుండి ఇద్దరి మధ్య పెద్దగా విమర్శలు లేవు. చంద్రబాబు కూడా హైదరాబాద్‌ను వదిలేసి ఎక్కువగా విజయవాడలోనే వుంటున్నాడు. అలాగే విజయవాడకు రాజధానిని మార్చే ప్రయత్నాలను ముమ్మరం చేసాడు. ఇక అమరావతి రాజధాని శంకుస్థాపనకు రావాలని కేసీఆర్‌ను చంద్రబాబు ఆహ్వానించడం, కేసీఆర్ రావడం జరిగింది. అలాగే ఇప్పుడు తాను చేసే చండీయాగానికి రావాలని చంద్రబాబును కేసీఆర్ స్వయంగా వచ్చి ఆహ్వానించడం చూసాము. చంద్రబాబును పూర్తిగా తెలంగాణ నుండి తరిమేయాలనుకున్న కేసీఆర్ తన ప్రయత్నంలో కొంత వరకు విజయం సాధించినట్లే! కాబట్టే చంద్రబాబుతో శత్రుత్వానికి బదులు ఇప్పుడు స్నేహంగా ఉంటున్నాడు.

# నారాయణకు మంత్రమేసిన ఆనం






*బండ్లు ఓడలు, ఓడలు బండ్లు కావడం అంటే ఇదేనేమో! ఒకప్పటి సాధారణ ట్యూటర్ నారాయణ ఏంటి... ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆనం సోదరులకు రాజకీయ పునరావాసం కల్పించడమేంటి? రాజకీయాలలో చూస్తే ఆనం సోదరులు కొండల్లాంటి వాళ్లయితే, నారాయణ కంకర రాయి లాంటోడు. కాని ఈరోజు ఆనం సోదరులు తెలుగు దేశంలోకి రావడంలో అతనే కీలకపాత్రధారి అయ్యాడు.*

రాజకీయాల్లో స్నేహం, శత్రుత్వం ఎప్పుడూ శాశ్వతం కాదు. ఆనం బ్రదర్స్, నారాయణల మధ్య కూడా అదే జరిగింది. నారాయణ ఓ చిన్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్ పెట్టినప్పటికే ఈ జిల్లాలో ఆనం కుటుంబంలో మంత్రులు, ఎమ్మెల్యేలు వున్నారు. ఆ తర్వాత నారాయణ విద్యా పరంగా ఎదిగినా రాజకీయాల జోలికి రాకపోవడంతో ఆనం వాళ్లు ఆయనతో సన్నిహితంగానే ఉండేవాళ్లు. అయితే రెండేళ్ల క్రితం మాత్రం ఓ మెడికల్ కాలేజీ సీటు విషయంలో నారాయణకు వివేకాకు మధ్య తేడాలొచ్చినట్లు తెలిసింది. 2014 ఎన్నికలకు ముందు నారాయణ మెడికల్ కాలేజీలో నిర్మాణంలో వున్న ఓ అంతస్తు కూలిపోవడం జరిగింది. అప్పుడు కాంగ్రెస్ గవర్నమెంట్ వుంది. ఆనం సోదరుల హవా నడుస్తుంది. చిక్కిందే ఛాన్స్ అనుకుని అప్పుడు వివేకా రెచ్చిపోయాడు. నారాయణ సంఘటన మీద విచారణ చేయించి కేసులు కూడా పెట్టించాడు. అయితే ఆ తర్వాత కొన్ని నెలలకే ఎన్నికలు రావడం, తెలుగుదేశం అధికారంలోకి రావడం, నారాయణ మున్సిపల్ శాఖకే మంత్రి కావడం, ఈ కేసులు గాలికిపోవడం జరిగిపోయాయి. నారాయణ మంత్రి అయ్యాడు కాబట్టి ఆనం సోదరుల మీద ప్రతీకారం తీర్చుకుంటాడని అందరూ భావించారు. ఈ అయ్యోరికి ప్రతీకార రాజకీయాలు తెలియవు. అవన్నీ తెలుసుంటే ఇంత పెద్ద విద్యాసంస్థల అధిపతి అయ్యుండేవాడు కాదు. ఆయనకు వ్యాపారం తెలుసు. చంద్రబాబు చెప్పిన పనులు చేయడం తెలుసు. అందుకే ఆయన ఆనం వాళ్లు తనను ఇబ్బంది పెట్టినా పట్టించుకోలేదు. సరికదా, ఇప్పుడు ఆనం వాళ్లను తెలుగుదేశంలో చేర్చడంలో ఆయనే కీలకపాత్ర పోషించాడు. జిల్లాలో పార్టీని మెయింటేనే చేసే శక్తి నారాయణకు లేదు. అలాంటి అవసరం కూడా ఆయనకు లేదు. జిల్లాలో పార్టీని నడిపే నాయకత్వం కావాలి. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని పక్కనపెట్టాలి. ఈ టార్గెట్‌తోనే నారాయణ ఆనం బ్రదర్స్‌కు మద్దతుగా నిలిచాడు. ఆనం సోదరులు కూడా ఇప్పుడు అడ్జస్ట్ అయిపోయి గత కోపాలను పక్కనపెట్టి మా నారాయణ అంతటి బుద్ధిమంతుడు లేడంటున్నారు.

## తండల్ రాక్షసుల భరతం పడతాం...



అధిక వడ్డీల పేరుతో ప్రజలను హింసలకు గురిచేస్తున్న వ్యాపారుల పని పడతామని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు. 16వ తేదీ నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2రూపాయలకు మించి వడ్డీలు చెల్లించొద్దని, అంతకుమించి వడ్డీ అడిగితే వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదులు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో పదిరూపాయల నుండి ఇరవై రూపాయల వరకు వడ్డీలు వసూలు చేస్తూ చిన్న, సన్న వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్న వ్యాపారుల భరతం పట్టాలని ఎస్పీని కోరారు. విజయవాడలో జరిగిన కాల్‌మనీ సంఘటనతో వడ్డీ వ్యాపారుల దారుణాలను అరికట్టడానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుందని అన్నారు.


శస్త్రచికిత్స అంటే ఒక బాధాకరమైన అనుభవంలా ఇబ్బంది పడనవసరం లేదు ఇప్పుడు.

- గ్లోబల్ హెల్త్ సిటీ, చెన్నై.

GLOBAL HEALTH CITY™
more to life





గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో సైన్స్ - జీర్ణ సంబంధిత అన్ని వ్యాధులు మరియు జీర్ణాశయాంతర ప్రేగు యొక్క రుగ్మతలకు అన్ని రకాల వైద్య మరియు శస్త్రచికిత్సలో అసమానమైన ప్రతిభను కనపరుస్తుంది.

గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో సైన్స్ - 20 సంవత్సరాలుగా భారతదేశంలో, పూర్తి స్థాయి అనుభవం కలిగిన అనుభవజ్ఞులతో అందరిచే మన్ననలు పొందే విధంగా వైద్య విధానాలు అందిస్తున్నందుకు గర్వపడుతున్నాం. అంతే కాక ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్ల నుండి సరికొత్త వైద్య పద్ధతులను అనుసరిస్తున్న వైద్య నిపుణుల సలహాలు సంప్రదింపులు పొందే ఎన్నో వైద్యసంస్థలు ఉన్నా కాని అబ్‌స్ట్రక్టివ్ కామెర్లు, జీర్ణకోశ క్యాన్సర్లు, వ్యాధిగ్రస్తమైన ఊబకాయం (ఒబెసిటీ), గ్యాస్ట్రో క్యాన్సర్స్, మార్బిడ్ ఒబెసిటీ, జీర్ణాశయంలో రాళ్లు ఇలాంటి మరెన్నో వ్యాధులకు ప్రజలను ఎంతగానో నమ్మే భారతదేశంలోనే ఏకైక కేంద్రంగా నిలిచింది.

క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, రేడియాలజిస్టులు, మరియు అనుభవం కలిగిన నర్సింగ్ సిబ్బందితో, ఆధునిక చికిత్సా విధానాలతో ఎండోస్కోపి విభాగం, 3డి లాప్రోస్కోపి మరియు ఆధునిక శస్త్రచికిత్స పరికరాలు, అంతర్జాతీయ శ్రేణి ప్రమాణాలు కలిగిన ఆపరేషన్ థియేటర్, సి-ఆర్మ్ ఎక్స్‌రే విభాగాలతో భారతదేశంలోనే అత్యుత్తమ సేవలు అందిస్తుంది గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో సైన్స్. అంతే కాక జీర్ణ శాస్త్ర వాస్తవాలు దానికి సంబంధించిన మరెన్నో నూతన చికిత్సా విధానాలను అవలంబిస్తుంది. దేశంలోనే ERCP, EUS పద్ధతులను అవలంబిస్తున్న సంస్థలలో ఒకటిగా గుర్తింపబడిన అతి తక్కువ వైద్య కేంద్రాలలో ఒకటిగా నిలిచింది గ్లోబల్ హెల్త్ సిటీ, చెన్నై.

గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో సైన్స్



మా ప్రత్యేకత:

చిన్న గాటుతో చికిత్స

అత్యుత్తమ సంరక్షణ.. చిన్నపాటి నొప్పితో..

ఊబకాయం మరియు బరువు సమస్యలకు సంబంధించిన ఒక శస్త్రచికిత్స ప్రక్రియ ఇది మా నిపుణులు శస్త్రచికిత్స విధానంలో తక్కువ గాటుతో ఉత్తమ ఫలితాన్ని అందించగలరు.

గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో సైన్స్ వారి ఆఫర్స్:

చిన్న గాటుతో గ్యాస్ట్రిక్ శస్త్రచికిత్సలు
- గజ్జల్లో పుట్టే వరిబీజం
- అన్నవాహిక మరియు ఫోర్‌గట్ శస్త్రచికిత్స
- కొలోరెక్టల్ సర్జరి
- అన్ని రకాల జీర్ణాశయాంతర కాన్సర్స్

చిన్న గాటుతో బారియాట్రిక్ శస్త్రచికిత్సలు
- స్లీవ్ గ్యాస్ట్రెక్టోమి
- సింగిల్ పోర్ట్ బారియాట్రిక్ శస్త్రచికిత్స
- రౌక్స్-ఎన్-వై గాస్ట్రిక్ బైపాస్
- అడ్జస్టబుల్ గ్యాస్ట్రిక్ బాన్డింగ్

గ్లోబల్ హెల్త్‌సిటీ, 439 చెరన్‌నగర్, పెరుంబాకం, షోలింగ నల్లూరు, చెన్నై - 100
Ph: +91 - 44 - 4477 7000, Email: infochennai@globalhospitalsinfa.com

గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్, నెం. 16-2-230, క్రైజన్ హైట్స్, సండేమార్కెట్, పొగతోట, నెల్లూరు -1.
ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్: 9989777101,7680931555, 8978788116, 8978788115

24/7 UDANAE GLOBAL Emergency Care ✆044-4624 2424


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com